మంగళవారం
TUESDAY
26.11.2024
సంచిక: 98
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణుడి మాట

కామం, కోపం, దురాశ.. ఈ మూడు నరకానికి మూడు తలుపులు

ముహూర్తం

మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:31 సూర్యాస్తమయం - సా. 5:35 తిథిజ ఏకాదశి తె. 3:47o వరకు సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం హస్త తె. 4:28o వరకు యోగం ప్రీతి మ. 2:11 వరకు కరణం బవ మ. 2:24 వరకు భాలవ తె. 3:47o వరకు వర్జ్యం మ. 1:35 నుండి మ. 3:23 వరకు దుర్ముహూర్తం ఉ. 8:44 నుండి ఉ. 9:28 వరకు రా. 10:46 నుండి రా. 11:37 వరకు రాహుకాలం మ. 2:49 నుండి సా. 4:12 వరకు యమగండం ఉ. 9:17 నుండి ఉ. 10:40 వరకు గుళికాకాలం మ. 12:03 నుండి మ. 1:26 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:55 నుండి తె. 5:43 వరకు అమృత ఘడియలు రా. 9:47 నుండి రా. 11:35 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:41 నుండి మ. 12:25 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున నిన్నటి నేడుటి రేపు

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్న సన్నిధిలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.స్వామివారి దర్శనానికి 3 గంటలకుపైగా సమయం పట్టింది.

స్కిల్ వర్సిటీ విరాళం వంద కోట్లు వెనక్కి

ఆదానీ డబ్బులు తీసుకోరాదని నిర్ణయం

ఢిల్లీకి ఎన్నిమార్లయినా వెళుతూనే ఉంటాం

విమర్శల నేపథ్యంలో సిఎం రేవంత్ ప్రకటన

హైదరాబాద్,నవంబర్ 25 (ఋషి ప్రతినిధి):అదానీ గ్రూప్‌పై లంచాల విమర్శల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్ల విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయించింది. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆ గ్రూప్‌పై విమర్శల దృష్ట్యా అదానీ ఫౌండేషన్ నుంచి విరాళాన్ని తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ అదానీ గ్రూపునకు లేఖ పంపినట్లు సీఎం వెల్లడించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమి అదానీపై వివాదానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని సీఎం రేవంత్ రెడ్డి తరువాయి 2 వ పేజీలో...

రూ.1000 తగ్గిన పసిడి

గ్లోబల్ మార్కెట్‌లో 1.45 శాతం పడిపోయిన గోల్డ్

అర్ధరాత్రి అనుమతులపై దర్యాప్తు!

జగన్-అదానీ విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి

చంద్రబాబుకు వైఎస్ షర్మిల బహిరంగ లేఖ



పరారీలో రామ్‌గోపాల్ వర్మ?

తమిళనాడులో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు

వాంకిడి విద్యార్థిని శైలజ మృతి

ఫుడ్ పాయిజన్‌కి గురై కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స

ప్రజల సమస్యలే.. ఎజెండా

కొత్త ఏడాదిలోకి అడుగిడుగుతున్న తరుణం

మనమంతా కలసికట్టుగా ముందుకు సాగాలి

పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ప్రధాని మోదీ

రాజ్యాంగం ఆవిర్భవించి నేటికి 75 ఏళ్లు

సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవం

పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు జరగాలని అధికార, విపక్ష సభ్యులనుకోరుతున్నాం. ప్రస్తుతం మనం 2024ను పూర్తి చేసుకోబోతున్నాం. పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి. విపక్షాలను టార్గెట్ చేస్తూ.. పార్లమెంట్‌లో చర్చకు అనుమతించడం లేదు. ఇది 2024 సంవత్సరానికి చివరి కాలం' -ప్రధాని మోదీ

రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

మహారాష్ట్రలో తగిన బుద్ధి చెప్పారు

రాళ్లలో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారు?

బీఆర్ఎస్ మీదేనా.. కాంగ్రెస్ మీద కేసులుండవా?

మహబూబాబాద్ మహాధర్నాలో కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గిరిజన, దళిత, పేద రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహాధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మహారాష్ట్రకు పోయి కూడా ఆడబిడ్డలను మోసం చేసే ప్రయత్నం చేస్తే అక్కడి ఆడబిడ్డలు బుద్ధి చెప్పారని తెలిపారు. వీడు పచ్చి లంగా, తెలంగాణలో ఆడబిడ్డలను మోసం చేశాడని చైతన్యం ప్రదర్శించి తన్ని తన్ని తరిమేశారని పేర్కొన్నారు. నేను తరువాయి 2 వ పేజీలో...

మహా సీఎం పీఠంపై వీడని ఉత్కంఠ!

ఢిల్లీకి మహాయుతి నేతలు

సీఎం రేసులో ఫడ్నవీస్, షిండే.. నేడు స్పష్టత వచ్చే అవకాశం

ముంబై, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): 'మహాయుతి' కూటమి 236 సీట్లతో అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. సీఎం సీటుకు సంబంధించి ఏదైనా ఫార్ములాపై చర్చ జరుగుతోందా అనే విషయంపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సోమవారం స్పందించారు. అలాంటి ఫార్ములా ఏదీ చర్చకు రాలేదని ఆయన చెప్పారు. మహాయుతి ప్రభుత్వానికి పట్టం కడుతూ ప్రజలు చాలా గట్టి తీర్పునిచ్చారని, అసెంబ్లీ విపక్ష నేత పదవికి అవసరమైన సంఖ్యాబలం కూడా 'మహా వికాస్ అఘాడి'కి రాలేదని చెప్పారు. "ఏ ఫార్ములాపై చర్చ జరగడం తరువాయి 2 వ పేజీలో...

హౌసింగ్ సొసైటీలకు సుప్రీంకోర్టు షాక్

హైదరాబాద్, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): జీహెచ్ఎంసీ పరిధిలో హౌసింగ్ సొసైటీలకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. హౌసింగ్ సొసైటీలకు కేటాయించిన భూ కేటాయింపులను రద్దు చేసింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టు సొసైటీలకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వాలు భూములు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వాలు బుక్ కేటాయింపులు చేయడాన్ని సవాల్ చేస్తూ రావు బీ చెలికాని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పును వెలువరించింది. కాగా, జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో సభ్యులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సెప్టెంబర్ 8న హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఇండ్ల స్థలాల కేటాయింపు పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి అందించారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో హౌసింగ్ సొసైటీలు పొందిన భూముల విషయమై సందిగ్ధం నెలకొన్నది.

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా,
rhushinews@gmail.com
మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

ప్రజల సమస్యలే ఎజెండా

- **కొత్త ఏడాదిలోకి అడుగిడుగుతున్న తరుణం**
- **మనమంతా కలసికట్టుగా ముందుకు సాగాలి**
- **పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో మోదీ**
- **రాజ్యాంగం ఆవిర్భవించి నేటికి 75 ఏళ్లు**
- **సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవం**



న్యూఢిల్లీ,నవంబర్25 (ఋషి ప్రతినిధి): ప్రజలతో తిరస్కరణకు గురైన వారు పార్లమెంట్‌ను నియత్రించే పనిలో ఉన్నారని ప్రధాని మోడీ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యలపై చర్చకు అంతా సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం అందుకు సంసిద్ధంగా ఉందన్నారు. శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ వెలుపల మీడియా పాయింట్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. పార్లమెంట్‌లో ఫలవంతమైన చర్చలు జరగాలని అధికార, విపక్ష సభ్యులను మోదీ కోరారు.ప్రస్తుతం మనం 2024ను పూర్తి చేసుకోబోతున్నాం అని అన్నారు. పార్లమెంట్‌లో ఆరోగ్యకరమైన చర్చలు జరపాలని ఎంపీలందరికీ విజ్ఞప్తి చేశారు. విపక్షాలను టార్గెట్ చేస్తూ.. పార్లమెంట్‌లో చర్చకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇది 2024 సంవత్సరానికి చివరి కాలం' అని ప్రధాని అన్నారు. 2025 కోసం దేశం సిద్ధమవుతోంది. ఈ పార్లమెంట్ సమావేశాలు ఎన్నో అంశాలపరంగా ముఖ్యమైనవి. భారత రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ నవంబరు 26 నాటికి 75వ ఏడాదిలోకి అడుగు పెడుతున్నాం. దానికి గుర్తుగా రేపు సంవిధాన్ సదన్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుందాం అని మోదీ మీడియాతో మాట్లాడారు. ప్రజల చేత తిరస్కరణకు గురైన కొందరు వ్యక్తులు.. కొందరి చేత గూండాయిజం చేయించి, పార్లమెంట్‌ను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి చర్యలను దేశ ప్రజలంతా చూస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారు చూస్తూ ఊరుకోరు. అయితే ఇక్కడ బాధించే విషయం ఏంటంటే.. పార్టీలతో సంబంధం లేకుండా కొత్తగా పార్లమెంట్‌కు ఎన్నికైన వారు కొత్త ఆలోచనలతో వస్తుంటారు. కొందరి గందరగోళ చర్యల వల్ల కొత్త ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు. వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించరు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోరు. వారికి ప్రజలపై ఎలాంటి బాధ్యత ఉండదు. అందుకే వారు ప్రజల అంచనాలను ఎన్నటికీ అందుకోలేరని మోదీ సభా కార్యకలాపాలు సాగనివ్వని వారి తీరును ఆక్షేపించారు. ప్రపంచం ఇప్పుడు మనల్ని ఎంతో ఆశావహ దృక్పథంతో చూస్తోంది. ఆ గౌరవం పెంపొందేలా సభలో మన ప్రవర్తన ఉండాలి. పార్లమెంట్ వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉంది. దానికి అనుగుణంగా మనం నడుచుకోవాలి. వివిధ అంశాలను సరైన రీతిలో సభలో ఎత్తిచూపడం ద్వారా మనం వారి ఆకాంక్షలను నెరవేర్చగలం. దానినుంచి రాబోయే తరాలు ప్రేరణ పొందుతాయి. ఈ సెషన్ ఫలవంతంగా ఉంటుందని ఆశిస్తున్నాను. ఈ సమావేశాలను ఉత్సాహంగా ముందుకుతీసుకెళ్లాలని ఎంపీలందరినీ కోరుతున్నానని మోదీ అన్నారు. దేశం 2025ని పూర్తి ఉత్సాహంతో, ఉత్సాహంతో స్వాగతించేందుకు సిద్ధమవుతోంది. ఈ పార్లమెంటు సమావేశాలు అనేక విధాలుగా ప్రత్యేకమైనవి. ఇప్పుడు అతిపెద్ద విషయం ఏమిటంటే, మన రాజ్యాంగం 75 సంవత్సరాల ప్రయాణం, 75వ సంవత్సరంలోకి ప్రవేశించడం ప్రజాస్వామ్యానికి మంచి అవకాశమని గుర్తు చేశారు. రాజ్యాంగం 75వ వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించడానికి రేపు అందరూ రాజ్యాంగ పరిషత్‌లో కలిసి రావాలని ప్రధాని కోరారు. మహారాష్ట్ర, యూపీలో బంపర్ విజయం సాధించిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి పార్లమెంట్ సమావేశాలను ఉద్దేశించి ప్రసంగించారు. శీతాకాల సమావేశాలు కావడంతో వాతావరణం చల్లగా ఉంటుందని ప్రధాని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. విపక్షాలపై విరుచుకుపడిన ప్రధాని మోదీ, కొద్దిమంది వ్యక్తులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ప్రస్తావించారు. ఆ వ్యక్తులు తమ బాధ్యతలను అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ గూండాయిజంతో పార్లమెంట్‌ను అదుపు చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని ప్రధాని మోదీ అన్నారు. వారు పార్లమెంటులో చర్చకు అనుమతించరు. పార్లమెంటు కార్యకలాపాలను ఆపడమే వారి సొంత లక్ష్యమని ఎద్దేవా చేశారు ప్రధాని మోదీ. కానీ దేశ ప్రజలు వారి ప్రవర్తనను పట్టించుకోరని, సమయం వచ్చినప్పుడు ప్రజలు వారిని శిక్షిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పార్లమెంటులో ఆరోగ్యకరమైన చర్చ జరగాలని సూచించారు. సాంప్రదాయం ప్రకారం సమావేశాల మొదటి రోజు, ప్రధాని మోదీ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రసంగించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు, లోక్‌సభ, రాజ్యసభల 19-9 సమావేశాలు జరుగుతాయి. వక్ఫ్ (సవరణ) బిల్లుతో సహా 16 బిల్లుల జాబితాను ప్రభుత్వం సెషన్‌లో పరిశీలనకు సిద్ధం చేసింది. లోక్‌సభలో ఎనిమిది, రాజ్యసభలో రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం పలు ముఖ్యమైన బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించేందుకు ప్రయత్నిస్తుంది. గత సెషన్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టిన బ్యాంకింగ్ నిబంధనల (సవరణ) బిల్లు, రైల్వే (సవరణ) బిల్లు ఇందులో ఉన్నాయి. కానీ వాటిని పాస్ చేయలేకపోయారు. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ ఆమోదం పొందిన ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. అనేక ముఖ్యమైన బిల్లులపై కాంగ్రెస్‌తో సహా పలు ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు గందరగోళంగా మారే ఛాన్స్ ఉంది.

శీతాకాల సమావేశాలు రేపటికి వాయిదా

న్యూఢిల్లీ, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): పార్లమెంట్ శీతాకాల సమావేశాలు బుధవారానికి వాయిదా పడ్డాయి. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉభయ సభలు.. తొలుత ఇటీవలేకాలంలో మృతి చెందిన సభ్యులకు సంతాపం తెలిపాయి. ఆ తర్వాత లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత అదానీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓంబిర్లా సభను బుధవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో ఎగువ సభను చైర్మన్ ధన్‌కర్ బుధవారానికి వాయిదా వేశారు. ఉభయ సభలు బుధవారం ఉదయం 11 గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు జరిగే ఈ సమావేశాల్లో వక్ఫ్ (సవరణ) సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. మణిపూర్ హింస, గౌతమ్ అదానీ అవినీతి చర్యలపై యూఎస్ అరెస్ట్ వారెంట్, ఢిల్లీలో వాయు కాలుష్యం తదితర అంశాలపై ఈ సమావేశాల్లో మోదీ సర్కారును నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి.

12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటి?

అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించే ప్లాన్!

ప్రైవేటీకరించేందుకు చేస్తున్న కుట్రల మాటేమిటి?

అదానీతో ప్రభుత్వం ఒప్పందాలన్నింటినీ రద్దుచేయాలి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): సీఎం తీసుకున్న ఈ నిర్ణయం పై మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత హరీష్‌రావు స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి..? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని , ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి ఇటీవల అదానీ ప్రకటించిన 100 కోట్ల విరాళాన్ని తిరస్కరిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన 100 కోట్లు నిధులు వెనక్కి తీసుకున్నారు సరే.. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని నినదిస్తున్న సమయంలో దావోస్‌లో మీరు అదానీతో చేసుకున్న 12,400 కోట్ల ఒప్పందాల సంగతేంటని ప్రశ్నించారు. అదానీకి రాష్ట్రంలోని డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు మీరు చేస్తున్న కుట్రల మాటేమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ పెడుతామనే ప్రతిపాదనతో వస్తే, మర్యాదపూర్వకంగా కలిసి చాయ్ తాగించి పంపించేశామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని తెలిపారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్ కార్పెట్ పరిచిందని విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆదానీతో రేవంత్ రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నాడని హరీశ్‌రావు అన్నారు. ఇప్పుడు అదానీతో అవినీతి బయటికిరాగానే మాట మార్చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మహా సీఎం పీఠంపై వీడని ఉత్కంఠ!

తరువాయి 2 వ పేజీలో...

లేదు. మేము ముగ్గురూ (కూటమి) కలిసి సీఎం పదవిపై చర్చిస్తాం. అసెంబ్లీలో ఎన్‌సీపీ నేతగా నన్ను ఎన్నుకున్నారు. శివసేన తరఫున ఏక్‌నాథ్ షిండే ఎన్నికయ్యారు. బీజేపీ కూడా ఇదే చేసింది. మేము కలిసి చర్చించుకుని సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం" అని అజిత్ పవార్ తెలిపారు. సీఎం రేసులో బీజేపీ నేత, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముందంజలో ఉన్నారు. బీజేపీ పోటీ చేసిన 149 స్థానాల్లో 132 స్థానాలను ఆ పార్టీ గెలుచుకోవడంతో ఫడ్నవిస్‌కు మూడోసారి సీఎం పగ్గాలు అప్పగిస్తారనే వాదన బలంగా ఉంది. మరోవైపు సీఎం రేసులో ఏక్‌నాథ్ షిండే ఉన్నారని ఆ పార్టీ నేత సంజయ్ షిర్‌సత్ తెలిపారు. సీఎం ఎవరనేది అంతిమంగా ఢిల్లీలో నిర్ణయిస్తారని, చర్చలు జరుగుతున్నందున ఫలితం ఏమిటనేది వేచిచూడాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు కూడా జరగాల్సి ఉన్నందున దానిని కూడా సీఎం ఎంపిక విషయంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మంగళవారానికి ఒక స్పష్టత వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. కాగా, ఢిల్లీలో సోమవారం మహాయుతి అగ్రనేతలు సమావేశమయ్యారు. అయితే, సీఎం పీఠంపై మాత్రం ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

సీఎం రేసులో ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే

మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి అనూహ్య విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. అయితే, ఇప్పుడు సీఎం ఎవరన్నది..? ఓ పెద్ద ప్రశ్నగా మారింది. ముఖ్యమంత్రి పదవికోసం దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే ఇద్దరూ పోటీ పడుతున్నారు. దీంతో ఎవరు సీఎం అవుతారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. మహా తదుపరి ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్‌కే అజిత్ పవార్ మద్దతు తెలిపినట్లు తెలిసింది. ఆదివారం జరిగిన సమావేశంలో దేవేంద్ర ఫడ్నవీస్‌ను సీఎం చేసేందుకు అజిత్ పవార్‌తో పాటు ఆయన ఎమ్మెల్యేలంతా మద్దతు పలికినట్లు సమాచారం. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో 288 సీట్లకు మహాయుతి కూటమి 235 సీట్లు నెగ్గి విజయాన్ని కైవసం చేసుకుంది. అందులో బీజేపీ 132 సీట్లతో ప్రధాన పార్టీగా ఆవిర్భవించింది. అయితే అధికారం చేపట్టడానికి 145 మ్యాజిక్ ఫిగర్ కాగా, బీజేపీ దానికి ఎంతో దూరంలో లేదు. ఈ నేపథ్యంలో బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీసే ముఖ్యమంత్రి అవుతారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే సీఎంగా షిండేనే కొనసాగించాలని బీజేపీలోని కొందరు నేతలు సూచిస్తున్నారు. ఈ సస్పెన్స్‌కు 24 గంటల్లో తెరపడే అవకాశం ఉంది. మరోవైపు మహారాష్ట్ర సీఎం ప్రమాణస్వీకారం ఉంటుందని పార్టీ వర్గాలు తెలియజేశాయి. మహారాష్ట్ర కొత్త ప్రభుత్వం సోమవారం ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నాయని శివసేనకు చెందిన మంత్రి దీపక్ కేసర్కర్ తెలిపారు. తొలి విడుతలో ముఖ్యమంత్రితో పాటు 21 మంది మంత్రులతో ప్రభుత్వం కొలువుదీరనున్నదని విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యమంత్రితో పాటు వీరు ప్రమాణం స్వీకారం చేయనున్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి మినహా మరో 43 మందికి మంత్రివర్గంలో చోటు కల్పించవచ్చు. ఇందులో బీజేపీ నుంచి 21, శివసేన (షిండే) పార్టీ నుంచి 12, ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీ నుంచి 10 మందికి మంత్రులుగా అవకాశం లభించవచ్చని తెలుస్తున్నది.

వేములవాడకు పోటెత్తిన భక్తులు

వేములవాడ, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్న సన్నిధిలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బారులు తీరడంతో గర్భాలయంలో ఆర్జిత, అన్న పూజల సేవలను అధికారులు రద్దు చేశారు. స్వామివారి దర్శనానికి 3 గంటలకుపైగా సమయం పడుతున్నది. భద్రాచలంలో గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. నదిలో కార్తిక దీపాలు వదిలారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు.. కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

రేవంత్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయ్

తరువాయి 2 వ పేజీలో...

ఇక్కడ వస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతమని అంటున్నారని కేటీఆర్ తెలిపారు. నేను డీజీపీ, ఎస్పీ గారిని అడుగుతున్నా.. రాళ్లతో కొడతామంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసులు మా మీద మాత్రమే పెడుతారా? కాంగ్రెస్ ఎమ్మెల్యేల మీద కేసులు ఉండవా? అని నిలదీశారు. మా గిరిజన రైతుల కోసం కదులుతూ మానుకోటలో ధర్నా చేస్తామంటే లగచర్లలో జరిగిన సంఘటనకు మానుకోటలో ధర్నా ఎందుకు అని డీజీపీ ప్రశ్నించారని తెలిపారు. కొడంగల్ రైతుల కోసం ఒక్క మానుకోటలోనే కాదు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ దళితులు, బీసీలు, గిరిజనులు ఉన్నారో అక్కడ ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. సన్నకారు, బక్క చిక్కిన రైతులతో పెట్టుకున్న ఈ రేవంత్ రెడ్డికి తప్పకుండా బుద్ధి చెప్పే సమయం వస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. .రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే దాకా వదిలిపెట్టమని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాళ్లతో కొడతామంటే, పెట్రోల్ పోస్తామంటే భయపడమని కేటీఆర్ అన్నారు. మేము కేసీఆర్ తయారు చేసిన దళం.. భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మానుకోట రాళ్ల మహత్యం ఏందో తెలంగాణను అడ్డుకున్న వాళ్లందరికీ తెలుసని అన్నారు. మానుకోటలో 14 ఏళ్ల క్రితమే నిప్పు పుట్టి ఆ తర్వాత తెలంగాణ వచ్చిందని అన్నారు. ఇవాళ మీరు పర్మిషన్ ఇవ్వకుంటే హైకోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకున్నామని అన్నారు. ఈ మహా ధర్నాకు వెయ్యి మంది అనుకుంటే 25 వేల మంది వచ్చారని.. అంటే ప్రభుత్వం మీద ఎంత కోపం, వ్యతిరేకత ఉందో ఈ మానుకోట మహాధర్నా చూస్తే అర్థమవుతోందని అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో మానుకోట కీలకం

ఇదే మానుకోట 14 ఏళ్ల కిందట ఇదే మానుకోట తెలంగాణ ఉద్యమంలో ఓ కీలకమైన మలుపునకు కారణమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ అదే మానుకోట ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ భూములు గుంజుకుంటా ఏం చేసుకుంటారో చేసుకోండి అంటున్న కొత్త నియంతకు బుద్ధిచెప్పేందుకు సిద్ధమైందని తెలిపారు. అసలు ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఏం జరిగిందో ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. లగచర్లలో ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ ముఖ్యమంత్రి మీద తిరగబడ్డారని కేటీఆర్ తెలిపారు. వారి భూములను తీసుకుంటామని చెబుతే మా ఆడబిడ్డలు 9 నెలల పాటు ధర్నా చేసి నిరసన తెలిపారని అన్నారు. 9 నెలలుగా సొంత నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ ముఖ్యమంత్రికి సమయం లేదని విమర్శించారు. కానీ ఎక్కే విమానం దిగే విమానం అన్నట్లుగా 28 సార్లు ఢిల్లీకి పోయిండు.. కనీసం 28 పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి మీద ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు. మొన్న అధికారులు పోతే ప్రజలు నిరసన తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి, ఉరికించి కొట్టేవారని అన్నారు. ఎందుకంటే ఢిల్లీలో రైతులు ఏడాది పాటు అందోళన చేసి మోదీ లాంటి వ్యక్తినే నల్ల చట్టాల నుంచి వెనక్కి తగ్గేలా చేశారని గుర్తుచేశారు .

ఫార్మా విలేజ్ ఎవరి కోసం..

ఫార్మా విలేజ్ ఎవరి కోసమని కేటీఆర్ ప్రశ్నించారు. తన అల్లుడి కోసం రేవంత్ రెడ్డి పేదవాళ్ల భూములను గుంజుకుంటున్నాడని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రి తన సొంత అల్లుడు, అదానీ, అన్నగాడు, తమ్ముని కోసం తప్ప రాష్ట్ర ప్రజల కోసం పని చేయడం లేదని విమర్శించారు. మరో 10 రోజులైతే రేవంత్ రెడ్డి పాలనకు ఏడాది అవుతుందని గుర్తుచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. 420 హామీలు ఇచ్చారా? ఒక్క హామీనైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు.

స్కిల్ వర్సిటీ విరాళం వంద కోట్లు వెనక్కి

తరువాయి 2 వ పేజీలో...

స్పష్టం చేశారు. అంబానీ, అదానీ, టాటా ఎవరికైనా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. అయితే ఆదానీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వందకోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. అదానీ ఇచ్చిన రూ.100 కోట్లు.. ముఖ్యమంత్రి, మంత్రులకు ఇచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన.. రూ.100 కోట్లు స్వీకరించకూడదని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు బదిలీ చేయవద్దని.. అదానీ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం తరఫున లేఖ సైతం రాసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా అదానీ అంశంపై తీవ్ర దుమారం రేగుతోందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం.. నిధులు సేకరించినట్లు ప్రచారం జరుగుతోందన్నారు. అయితే చట్టబద్ధంగా నిర్వహించే టెండర్లలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని ఆయన చెప్పారు. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు స్వీకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగ వద్దని ఈ సందర్భంగా ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు వెళ్లాలని తహతహలాడుతు న్నారన్నారు. జైలుకెళ్తే సీఎం అవ్వొచ్చని కేటీఆర్ భావిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ కుటుంబం నుంచి ఇప్పటికే కవిత జైలుకు వెళ్లారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. జైలుకెళ్లినవాళ్లు సీఎం అయ్యేదుంటే.. ముందు కల్వకుంట్ల కవిత అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబంలో సీఎం సీటు కోసం పోటీ ఎక్కువగా ఉందన్నారు. తన తాజా ఢిల్లీ టూర్ పర్యటనపై సైతం సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమే ఈ ఢిల్లీ పర్యటన అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఢిల్లీ పర్యటనతో రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేదని ఆయన ప్రకటించారు. పార్లమెంట్ సమావేశాలపై మంగళవారం పార్టీ ఎంపీలతో చర్చిస్తామని ఆయన తెలిపారు. అందుబాటులో ఉన్న మంత్రులను కలిసి.. రాష్ట్ర సమస్యలను వారికి వివరిస్తామని చెప్పారు.అయితే తాను 28 సార్లు ఢిల్లీ వెళ్లానని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీలా పైరవీలు చేయడానికి.. బెయిల్ కోసం తాను ఢిల్లీ వెళ్లడం లేదని బీఆర్ఎస్ అగ్రనేతలను పరోక్షంగా విమర్శించారు. కానీ కేంద్రాన్ని కలిసి మనకు రావాల్సినవి రాబట్టుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం అవసరమైతే ఎన్నిసార్లు అయినా.. ఢిల్లీ వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం.. అదానీకి ఎన్నో ప్రాజెక్టులు కట్టబెట్టిందని గుర్తు చేశారు. అదానీ సంస్థపై లంచాల విమర్శల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై విధంగా స్పందించారు. అదానీ విషయంలో కొన్ని రోజులుగా దేశ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అదానీ నుంచి తెలంగాణ ప్రభుత్వం నిధులు స్వీకరించిందని కొందరు విమర్శలు చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా, చట్టబద్ధంగానే అదానీ నుంచి పెట్టుబడులు అనుమతిస్తాం. నిబంధనల మేరకే టెండర్లు పిలిచి ప్రాజెక్టులు ఇస్తున్నాం. దేశంలో ఏ సంస్థలకైనా చట్టబద్ధంగా వ్యాపారం చేసుకొనే హక్కు ఉంటుంది.

అంబానీ, అదానీ, టాటా.. ఎవరికైనా తెలంగాణలో వ్యాపారం చేసుకొనే హక్కు ఉంది. గొప్ప సంకల్పంతో లక్షలాది మంది నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించే లక్ష్యంతో స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. గొప్ప సదుద్దేశంతో ప్రారంభించిన ఈ వర్సిటీ వివాదాలకు లోను కావడం మంత్రివర్గ సహచరులకు, నాకు, ప్రభుత్వానికి ఇష్టంలేదు. అదానీ గ్రూప్ స్కిల్స్ వర్సిటీకి ఇచ్చిన విరాళాన్ని సీఎం, మంత్రులకు ఇచ్చినట్లు కొందరు ప్రచారం చేస్తున్నారు. సీఎస్ఆర్ కింద స్కిల్స్ వర్సిటీకి అదానీ గ్రూప్ ప్రకటించిన రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని కోరుతూ ఆ గ్రూప్‌కు లేఖ పంపాం. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని లాగొద్దు. తెలంగాణ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎవరి నుంచీ డబ్బులు రాలేదు' అని సీఎం అన్నారు.

ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు ముమ్మర ఏర్పాట్లు

కొత్తగా మరో 4 ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి

తొలుత అందుబాటులోకి రానున్న మామునూరు ఎయిర్‌పోర్టు

హైదరాబాద్,నవంబర్25 (ఋషి ప్రతినిధి): తెలంగాణ లో కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు అందుబాటు లోకి రానున్నాయి. వరంగల్‌లోని మామునూరు, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సీఎం రేవంత్ సర్కారు రెడీ అయ్యింది. ఇక కేంద్రంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా తెలుగు వ్యక్తి రామ్మోహన్ నాయుడు ఉండడంతో అనుమతుల విషయంలోనూ సానుకూల స్పందన వచ్చే ఛాన్స్ ఉంది. అయితే హైదరాబాద్ తర్వాత తెలంగాణ లోనే అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఉన్న మామునూరు లో తొలుత ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. తొలి విడతలో మామునూరు ఎయిర్‌పోర్టును చిన్న విమానాల రాకపోకలకు అనుగుణంగా సిద్ధం చేస్తారు. వరంగల్ మహానగరం మాస్టర్ ప్లాన్ తయారీకి ఇప్పటికే ఆమోదం లభించింది. మాస్టర్ ప్లాన్ అమలుతో పాటు మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి ప్రక్రియను 2025 డిసెంబరుకల్లా పూర్తి చేయాలని తెలంగాణ సర్కారు టార్గెట్‌గా పెట్టుకుంది. ఆ తర్వాత 2027 సంవత్సరం నాటికి రెండో దశలో పెద్ద విమానాలు, కార్గో విమానాల ఆపరేషన్‌కు వీలుగా మామునూరు ఎయిర్ పోర్టును డెవలప్ చేస్తారు. వాస్తవానికి నిజాం నవాబు పాలనా

కాలంలో మామునూరులో ఎయిర్ పోర్టు ఉండేది. దీనికి ఇప్పటికే 696.14 ఎకరాల భూమి ఉంది. ఎయిర్ పోర్టు కోసం అదనంగా మరో 253 ఎకరాలను సేకరించేందుకు తెలంగాణ సర్కారు రూ.205 కోట్లను ఇటీవలే విడుదల చేసింది. రాబోయే నాలుగేళ్లలో భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు కూడా అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్ పోర్టు ఏర్పాటు కోసం మూడు మండలాల పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాల్లో భూసేకరణపై ఓ అంచనాకు వచ్చారు. రామగుండం పట్టణం సమీపంలో ఉన్న బసంత్‌నగర్‌లో గతంలోనే ఎయిర్‌పోర్టు ఉండేది. బీకే బిర్లా తమ సిమెంట్ పరిశ్రమ సమావేశాలకు రావడానికి దీన్ని అప్పట్లో ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో కొత్తది ఏర్పాటు చేయాలని తెలంగాణ సర్కారు యోచిస్తోంది. ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు దాదాపు 1,592 ఎకరాల్లో భూమి రెడీగా ఉందని తెలుస్తోంది. అయితే ఈ మూడు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నుంచి అనుమతులను పొందాల్సి ఉంది.

రాష్ట్రంలో అంబర్- రెసోజెట్ పెట్టుబడులు

- **250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు**
- **సంస్థ రాకతో వెయ్యి ఉద్యోగాలు లభించే అవకాశం**
- **ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి**

హైదరాబాద్, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): తెలంగాణలో మరో కంపెనీ పెట్టుబడులకు సిద్ధమైంది. పెట్టుబడులతో పాటు మరో వెయ్యి మందికి ఉపాధి కలగనుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వినియమ వస్తువులు, విడి భాగాలు అందించే అంబర్–రెసోజెట్ భాగస్వామ్య సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వినిమయ వస్తువులు, విడిభాగాలు అందించే 'అంబర్– రెసోజెట్ భాగస్వామ్య సంస్థ రాష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. సోమవారం నాడు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో సంస్థ ప్రతినిధులు తమ పెట్టుబడుల ప్రణాళికను వెల్లడించారు. అంబర్– రెసోజెట్ సంస్థకు ప్రభుత్వ పరంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సంస్థ దేశంలోని పలు కంపెనీల కోసం రూమ్ ఏసీలు, అత్యాధునిక వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, పారిశ్రామిక ఎయిర్ కండిషనర్ల లాంటి పలు పరికరాలకు ఉత్పత్తి చేసి అందిస్తోందని ఆయన తెలిపారు. వచ్చే మూడేళ్లలో రూ.250 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పుతుందని శ్రీధర్ బాబు చెప్పారు. దీని వల్ల ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. త్వరలోనే అత్యాధునిక ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పిసిబి) ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. వందేభారత్ రైళ్లు, మెట్రో రైళ్ల ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థలతో పాటు, బస్సులు, డిఫెన్స్ వాహనాలు, పారిశ్రామిక అవసరాలకు ఎయిర్ కండిషనర్ల తయారీలో అంబర్ ఎంటర్ ప్రైజెస్ కు మంచి పేరుందని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి యూనిట్లు ఉన్న అంబర్ తాజాగా హైదరాబాద్ ను గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీఐఐసీ ఎండీ డా. ఇ. విష్ణువర్ధన్ రెడ్డి, సిఇఓ మధుసూదన్, డైరెక్టర్ ఎలక్ట్రానిక్స్ డా. ఎస్ కె శర్మ, అంబర్, రెసోజెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా దీక్షా దివస్

హైదరాబాద్, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): ప్రపంచ వ్యాప్తంగా దీక్షా దివస్ నిర్వహిస్తామని ఎన్నారై కో ఆర్డినేటర్ మహేష్ బిగాల అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 29 నవంబర్, 2009న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే అన్నారు. తెలంగాణ ఉద్యమ గతిని దీక్షా దివస్ మార్చేసింది. తెలంగాణ సమాజం యావత్తు కేసీఆర్ వెంట నిలవడంతో..కేంద్రం మెడలు వంచి చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దీక్షా దివస్ స్ఫూర్తిని, అమరుల త్యాగాలని, జ్ఞాపకాలను, పోరాటాలను గుర్తించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రపంచ దేశాలలో దీక్ష దివస్‌ని జరపాలని మహేష్ బిగాల పిలుపునిచ్చారు. అలాగే ఈరోజు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా మహేష్ బిగాల కలిశారు. రాబోయే రోజుల్లో పార్టీ పరంగా బలోపేతం చేయడం, వివిధ విషయాలపై చర్చించారు.

పింఛన్ కోసం రోడ్డెక్కిన వృద్ధులు

నారాయణపేట జిల్లాలో ఘటన

నారాయణపేట,నవంబర్25 (ఋషి ప్రతినిధి): పింఛన్ కోసం వృద్ధులు నిత్యం ఏదో ఒకచోట రోడ్డెక్కుతున్నారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో సోమవారం పింఛన్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ సర్కారు హయాంలో నెలనెలా సక్రమంగా పింఛన్ ఇచ్చేవారన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 18 నుంచి 20వ తేదీలోగా పోస్టాఫీస్‌లో డబ్బులు ఇచ్చేవారని, ఈ నెల 25వ తేదీ వచ్చినా ఇంకా డబ్బులు ఇవ్వలేదని మండిపడ్డారు. పోలీసులు వృద్ధుల వద్దకు చేరుకొని రెండ్రోజుల్లో పింఛన్ ఇచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వృద్ధులు నిరసన వ్యక్తం చేశారు.

కేసీఆర్ పాలనలోనే బీసీలకు న్యాయం

కులగణనకు చట్టబద్ధత ఉందా?: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): కులగణనకు చట్టబద్ధత ఉందోలేదో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు, యునైటెడ్ ఫులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి డెడికేటెడ్ కులగణన కమిషన్‌కు 35 పేజీలతో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన సమగ్ర నివేదికను కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వం బీసీలకు ఎంతో న్యాయం చేసిందన్నారు. కులగణకు బీజేపీ వ్యతిరేకమని విమర్శించారు. కులగణన చేపట్టబోమని బీజేపీ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. బీజేపీ ద్వంద వైఖరిని బీసీలు ఖండించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఎన్నో హామీలు ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వాంకిడి విద్యార్థిని శైలజ మృతి

ఫుడ్ పాయిజన్‌కి గురై కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స

హైదరాబాద్,నవంబర్25 (ఋషి ప్రతినిధి): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కి గురై గత కొన్ని రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ సోమవారం మృతి చెందింది. అక్టోబర్ 30న వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరగగా 64 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురు పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. శైలజ పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ పై ఉంచి చికిత్స అందించారు. దాదాపు 20 రోజులుగా చికిత్స పొందిన ఆమె చివరకు మృత్యువాతపడ్డారు. శైలజ మృతితో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గురుకుల పాఠశాలలు అధ్వాన్నంగా మారి విద్యార్థులు చనిపోతున్నారని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్లక్ష్యానికి బలైపోయిన వాంకిడి గిరిజన గురుకుల విద్యార్థిని శైలజకు కన్నీటి నివాళి అర్పిస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. మీ ప్రాణాలు బలి తీసుకున్న పాపం.. ఈ దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటాడుతదన్నారు. 25 రోజులుగా నువ్వు వెంటిలేటర్ మీద అనుభవించిన నరకానికి ప్రభుత్వమే జవాబుదారీ అని హరీశ్‌రావు పేర్కొన్నారు.శైలజ తల్లిదండ్రులకు గుండె కోతను మిగిల్చిండు సీఎం రేవంత్ రెడ్డి. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. విషాహారం వల్ల కన్నుమూయటం కలిచి వేస్తున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకులంలో నాణ్యత లేని భోజనం పెట్టడం పాపం కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థులకు సకాలంలో మెరుగైన చికిత్స అందించకపోవడం మరొక పాపం. అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం విద్యార్థిని ప్రాణాల మీదకు తెచ్చింది. నిమ్స్ ఆసుపత్రిలో బిడ్డను పట్టుకొని అక్కడే ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇవ్వడంలోనూ కాంగ్రెస్ సర్కార్ పూర్తి వైఫల్యం చెందింది. చివరకు ఆ అమ్మాయి చావును కూడా దాచి పెట్టాలనే ఉద్దేశంతో, దొంగ చాటున మృతదేహాన్ని తరలిస్తుండడం సిగ్గుచేటు. కుటుంబానికి బాధ్యత వహించి రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

లగచర్ల అమాయకులను జైల్లో పెట్టారు

- **కేసులు ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలి**
- **ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

హైదరాబాద్,నవంబర్25 (ఋషి ప్రతినిధి): లగచర్ల ఘటనలో అమాయకులను జైలులో పెట్టారని, కేసులు ఎత్తివేసి బాధితులను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన సంగారెడ్డి జిల్లా కంది జైలులో లగచర్ల బాధితులను పరామర్శించారు. ఘటనకు సంబంధించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బక్కి వెంకటయ్య మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి గ్రౌండ్ లెవల్ రిపోర్టు ఇస్తామని చెప్పారు. లగచర్ల, రొంటిబండ తండాలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందం పర్యటించిందని, ఇప్పటికీ గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారన్నారు. కలెక్టర్‌పై దాడి ఘటన దురదృష్టకరమని, కానీ అమాయకులను జైల్లో పెట్టడం బాధాకరమన్నారు. లగచర్ల ఘటనలో పోలీసులు కర్కశంగా వ్యవహరించారని, అర్ధరాత్రి ఇండ్లల్లోకి చొరబడి దాడులు చేసి అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. బాధితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరికాదని, ఇది ఎస్సీ, ఎస్సీ యాక్టుకు విరుద్ధమన్నారు. అట్రాసిటీ కేసులపై స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ అధికారులను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమమంలో దళిత సంఘాల నాయకులు జగన్, దుర్గాప్రసాద్, ఎస్సీ,ఎస్టీ కమిషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి శ్మశానంలో కోడిని బలిచ్చిన అఘోరీ

కేసు నమోదు చేసిన వరంగల్ పోలీసులు

వరంగల్, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): నాగసాధు అఘోరీ .. ఈ పేరు ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో మార్మోగుతోంది. తన వికృత చేష్టలతో అటు మీడియా, ఇటు సామాజిక మాధ్యమాల్లో హల్చల్ చేసింది. తాజాగా, అఘోరీ ఊహించని వివాదంలో చిక్కుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడిని చంపినందుకు గానూ ఆమెపై కేసు నమోదైంది. ఈ నెల 19వ తేదీన వరంగల్ నగర శివారులోని బెస్తంచెరువు శ్మశాన వాటికలో పూజలు చేసిన అఘోరీ వికృత చేష్టలకు పాల్పడింది. రెండు రోజులు శ్మశానంలో విడిది చేసి అక్కడ విచిత్ర పూజలు చేసి బహిరంగంగానే కోడిని బలిచ్చింది. ఇది చూసిన స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తాజాగా వైరల్ అయ్యింది. శ్మశానంలో కోడిని బలివ్వడంపై కరీంనగర్ జిల్లాకు చెందిన జంతు ప్రేమికులు, లా విద్యార్థులు కసిరెడ్డి రోహన్ రెడ్డి, సౌమిత్ పటేల్‌లు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని మామునూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వీడియోలను పోలీసులకు సమర్పించారు. బహిరంగంగా కోడిని బలిచ్చి రక్తార్పణ చేయడం నేరమని.. కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అఘోరీపై సెక్షన్ 325 కింద కేసు నమోదు చేశారు. కాగా, పోలీసులు అఘోరికి ఎఫ్ఐఆర్ అందజేయడంతో పాటు స్టేషన్ బెయిల్ మంజూరు చేయరని పిటిషనర్ రోహన్ రెడ్డి తెలిపారు. రెండు నెలల్లోపు ఛార్జ్ షీట్ నమోదు చేస్తారని చెప్పారు. కేసు నిరూపణ అయితే ఒక్క

రోజు నుంచి 5 ఏళ్ల వరకూ జైలు శిక్ష పడే ఛాన్స్ ఉంటుందని అన్నారు. ఏ మతం వారైనా దేవుళ్ల పేరుతో జంతుబలి ఇవ్వడం నేరమని పేర్కొన్నారు. ప్రస్తుతం అఘోరీ ఎక్కడ ఉందో పోలీసులు గుర్తించలేదు. గత కొద్ది రోజులుగా ఏపీలో ఆలయాల వద్ద నాగసాధు అఘోరీ హల్చల్ చేసింది. కారులో ప్రయాణిస్తూ వివిధ ఆలయాలకు వెళ్లగా.. నగ్నంగా ఉండడంతో దర్శనానికి అనుమతించలేదు. అనంతరం ఆమె దుస్తులు ధరించి ఆలయాలను సందర్శించారు. ఇటీవలే మంగళగిరిలో నడిరోడ్డుపై హల్చల్ చేయగా పోలీసులు అఘోరీని అతి కష్టం మీద నిలువరించారు. మంగళగిరి హైవేపై బైఠాయించగా.. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో ఆమె వారిపై దాడికి పాల్పడింది. అనంతరం తెలంగాణకు చేరుకుంది. ఈ క్రమంలోనే సంచలన వ్యాఖ్యలు చేసింది. హిందూ ధర్మం రక్షణ కోసం పోరాడుతుంటే.. తనను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అఘోరీ మండిపడ్డారు. హిందూ దేవాలయాలు, ఆడపిల్లలపై అఘాయిత్యాలకు నిరసనగా తాను ఆత్మహత్య చేసుకుంటానని అన్నారు. తెలంగాణలో తనను ఆపే మగాడు ఇంకా పుట్టలేదని పేర్కొన్నారు. తెలంగాణలో ఆలయాలు ధ్వంసం అవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని తెలిపింది. స్త్రీలపై దాడులను ఆపే శక్తి మన దగ్గర ఉందని చెప్పుకొచ్చింది. గో హత్యలను నివారించేందుకు పోరాడదామని చెప్పుకొచ్చింది.

ఢిల్లీకి పవన్ కల్యాణ్

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ వెళ్లారు. ఆయన ఎవరితో అయినా సమావేశం అవుతారా లేదా అన్న దానిపై స్పష్టత లేదు. అయితే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇంట్లో జరగనున్న ఓ శుభకార్యంలో పాల్గొనే అవకాశం ఉంది. ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు కాబట్టి అధికారికంగా ప్రకటించలేదని అంటున్నారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కల్యాణ్ రెండో సారి ఢిల్లీ వెళ్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆయన ఢిల్లీ వెళ్లి అమిత్ షాతో సమావేశం అయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం కోసం ఆయనను అమిత్ షా పిలిచినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత ఇప్పుడు మరోసారి ఢిల్లీ వెళ్తున్నారు. పవన్ కల్యాణ్ ఢిల్లీలో రాజకీయ పరమైన సమావేశాలు జరిపే అవకాశం లేదేని అలాగే.. ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎంగా కేంద్ర మంత్రుల్ని.. కూడా కలిసే అవకాశం లేదని ఈ ఢిల్లీ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదేనని జనసేన వర్గాలు చెబుతున్నాయి. పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో ఎన్డీఏకు కీలక మిత్రపక్షంగా వ్యవహరిస్తున్నారు. మహారాష్ట్రలో చురుకుగా ప్రచారం చేయడంతో ఆయన ప్రచారం చేసిన అన్ని ప్రాంతాల్లోనూ అభ్యర్థులు మంచి విజయం సాధించారు. బీజేపీ అగ్రనేతల సూచనల మేరకే పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో ఎక్కువగా హిందూత్వవాదాన్ని వినిపిస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే ఈ విషయంలో స్పష్టత లేదు. ఈ అంశంపై ఆయన ఎప్పుడూ నేరుగా బీజేపీ నేతలతో సంప్రదింపులు జరపలేదు. తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని తేలిన తర్వాత ఆయన సనాతన ధర్మ పోరాటాన్ని ఎంచుకున్నారు. ప్రత్యేకంగా వారాహి డిక్లరేషన్ ను కూడా ప్రకటించారు. తమిళనాడులో డీఎంకే రాజకీయ వారుసజిగా పేరు తెచ్చుకున్న యువనేత, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ విమర్శలు గుప్పించారు. తరపున హిందూత్వ వాదాన్ని తమిళనాడులో వినిపించేందుకు పవన్ ను ఉపయోగించుకుంటారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీ పర్యటనలో ఏమైనా రహస్య సమావేశాలు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. అందుకే పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటన ఆసక్తి రేపుతోంది.

29న మోదీ విశాఖ పర్యటన రద్దు

తుపాను హెచ్చరికలతో ప్రధాని పర్యటన రద్దు

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటన పర్యటన రద్దయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 29న ప్రధాని మోదీ విశాఖలో పర్యటించాల్సి ఉంది. అయితే ప్రతికూల వాతావరణ హెచ్చరికలతో మోదీ పర్యటన రద్దు అయినట్లు పీఎంవో తెలిపింది. అనకాపల్లి పూడిమడకలోని ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపనతో పాటు జాతీయ రహదారుల అంకితం, కొన్ని రైల్వే ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయాల్సి ఉంది. ఈ పర్యటనలో భాగంగా విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ స్టేడియంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ సైతం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, తీవ్ర వాయుగుండంగా మారుతోంది. అనంతరం అది తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు చేసినట్లు ప్రధాని కార్యాలయం సోమవారం వెల్లడించింది.

పరారీలో రామ్‌గోపాల్ వర్మ?

తమిళనాడులో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు!

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పరారీలో ఉన్నట్టు ప్రకాశం జిల్లా పోలీసులు అనుమానిస్తున్నారు. రెండుసార్లు విచారణకు హాజరుకాకపోవడంతో అరెస్టు ఖాయమని గ్రహించిన ఆయన తప్పించుకుని తిరుగుతున్నారని భావిస్తున్నారు. అందుకే ఆయన ఎక్కడ ఉన్నా సరే పట్టుకోవాలని చూస్తున్నారు. అయితే ఇప్పుడు పోలీసులకు అందుకున్న సమాచారం ప్రకారం తమిళనాడులో ఆర్జీవీ ఉన్నారని తెలుస్తోంది. అందుకే ఆయన్ని అక్కడే పట్టుకోవాలని చూస్తున్నారు. తమిళనాడులో ఉన్న ఆర్జీవీ అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. అక్కడి పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆయనకు వ్యతిరేకంగా నమోదు అయిన కేసుల వివరాలు, కోర్టు తీర్పులను పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు ఆయన అరెస్టుకు సహకరించాలని వారిని కోరబోతున్నారు. ఆర్జీవీ ఇంట్లోనే విచారణ చేసేందుకు ప్రకాశం జిల్లా పోలీసులు హైదరాబాద్‌లో ఉన్న ఇంటికి వచ్చారు. అప్పటికే ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయారని సిబ్బంది తెలియజేశారు. ఎక్కడికి వెళ్లారని ఆరా తీస్తే తమకు తెలియదని చెప్పారు. అయితే పోలీసులు వారిని విచారించి ఆర్జీవీ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై వివరణ ఇవ్వాలని విచారణకు రావాలని ఇప్పటికే రెండుసార్లు ఒంగోలు పోలీసులు ఆర్జీవి నోటీసులు జారీ చేశారు. తనకు షూటింగ్ ఉన్నందున విచారణకు హాజరుకాలేనని మొదటి సారి పోలీసులకు సమాధానం చెప్పారు ఆర్జీవి. రెండోసారి నోటీసులు జారీ చేశారు. దాని ప్రకారం ఇవాళ హాజరుకావాల్సి ఉంది. దీంతో ఆయన విచారణకు హాజరుకాకపోవడంతోపాటు మరో రెండు వారాల సమయం కావాలని కోరినట్టు చెబుతున్నారు. విచారణకు ఆర్జీవీ మరింత సమయం అడగడంతో పోలీసులు నేరుగా ఆయన ఇంటికి వచ్చారు. ఇలా ఇంటికి రావడంపై ఆర్జీవీ అడ్వకేట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టులో పిటిషన్ల విచారణ పెండింగ్‌లో ఉందని మరో రెండు వారాలు గడువు కూడా కోరామన్నారు. దీనికి సమాధానాలు చెప్పకుండా నేరుగా ఇంటికి రావడమేంటని అంటున్నారు.

ప్రైవేట్ రంగంలో ప్రాజెక్టులు, రోడ్లు

నిర్మాణ నిర్వహణ ఇక సులభతరం

టోల్ వసూలుతో నిర్వహణా భారం

ఎపిలో ప్రయోగాత్మక అమలుకు నిర్ణయం

అమరావతి,నవంబర్25(ఋషి ప్రతినిధి): తెలుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పబ్లిక్,ప్రైవేటు పార్టనర్ షిప్ గురించి ఇటీవలి కాలంలో బాగా ఫోకస్ పెడుతున్నారు. శీఘ్రగతిన అభివృద్ధితో పాటు,ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ మోడల్ కొన్ని విభాగాల్లో అమలు చేస్తున్నారు. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో రోడ్ల నిర్వహణను అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించాలని చంద్రబాబు యోచిస్తున్నారు. వారు టోల్ ఫీజు వసూలు చేసుకుంటారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రోడ్లపైన పైలట్ ప్రాజెక్టుగా టోల్‌గేట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అసెంబ్లీలో చెప్పారు. ఈ క్రమంలో చంద్రబాబునాయుడు ఏపీలో అభివృద్ధి పనులకు ఈ మోడల్ అనుసరించాలనుకుంటున్నారు. అంటే రోడ్లను ప్రైవేటు కంపెనీలతో వేయిస్తారు. ప్రజల నుంచి టోల్ వసూలు చేస్తారు. ఇప్పటి వరకూ జాతీయ రహదారుల్లో ఈ విధానం ఉంది. ఇప్పుడు రాష్ట్ర రహదారులకూ తీసుకు వస్తారు. అలాగే గోదావరి నీటిని బనకచర్ల వరకూ తీసుకెళ్లేందుకూ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు రూ. 70వేల కోట్లు ఖర్చవుతాయి. అంటే ఆ డబ్బులూ ప్రజలు కట్టాల్సిందే. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర,జాతీయ రహదారులకు వెళ్లే మార్గాల్లో టోల్‌గేట్లు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు సిఎం తెలిపారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తానే పిపిపి పద్ధతిలో జాతీయ రహదారుల అభివృద్ధి ప్రతిపాదన చేశానని అప్పట్లో తనను అందరూ వ్యతిరేకించారని, కానీఇప్పుడు దేశ వ్యాప్తంగా నాలుగు, ఆరు, ఎనిమిది, 14 లైన్ల జాతీయ రహదారులు కూడా వచ్చాయన గుర్తు చేసుకున్నారు. గోదావరి నీటిని పెన్నాకు తరలించడానికి నదుల అనుసంధాన ప్రాజెక్టును చంద్రబాబు పరిశీలిస్తున్నారు. కృష్ణా నదికి తరలించిన గోదావరి మిగులు జలాలను ప్రకాశం బ్యారేజీ సమీపంలోని వైకుంఠపురం కు తరలిస్తారు. అక్కడ ప్రకాశం బ్యారేజీ తరహాలో బ్యారేజీ నిర్మిస్తారు. అక్కడి నుంచి బొల్లాపల్లికి తరలించేలా ప్రణాళిక రూపొందించారు. బొల్లాపల్లి రిజర్వాయరు నుంచి నల్లమల మీదుగా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు గోదావరి జలాలను తరలించేలా జల వనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల 22 టీఎంసీలను వెలిగొండ ప్రాజెక్టుకు సరఫరా చేయవచ్చని చెబుతున్నారు. ఇక బనకచర్ల కాంప్లెక్స్ నుంచి తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు 140 టీఎంసీలను తరలించవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు 180 టీఎంసీల గోదావరి జలాలను తరలించే వీలుంది. ఈ ప్రాజెక్టు చేపట్టాలంటే రూ.70 వేల కోట్లు కావాలి. అంత మొత్తం ప్రభుత్వం వద్ద ఉండదు. అందుకే చంద్రబాబు పీపీపీ మోడల్ గురించి ఆలోచిస్తున్నారు. రోడ్లు, ప్రాజెక్టులు ప్రైవేటు, ప్రభుత్వ పార్టనర్ షిప్‌లో ప్రాజెక్టుల్ని నిర్మిస్తారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఆయా కంపెనీలు ఆదాయం సంపాదించుకునే మార్గాలు చూపిస్తారు. టోల్ వసూలు చేస్తారా నీటి తీరువా వసూలు చేస్తారా మరొకటా అన్నది తర్వాత. రైతుల పంటలకు కావాల్సినంత నీరు సదుపాయం వస్తే.. అంత కంటే కావాల్సిందేమీ ఉండదని అంచనా వేస్తున్నారు. పీపీపీ విధానంతో ఏపీని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు ఎన్నికలకు ముందు నుంచీ చెబుతున్నారు . ప్రజల ఆదాయాలను పెంచితే వారు ఈ విధానం ద్వారా మేలు జరిగితే ఎంతో కొంత పన్నులు కట్టేందుకు సిద్ధంగా ఉంటారు. మేలు జరగకపోతే మాత్రం ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది.

చిక్కీల్లో సైతం డబ్బులు కాజేసిన జగన్

సుద్దపూసలా కబుర్లు చెప్పడం వింతగా ఉంది

గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థను నాశనం చేశారు

జగన్‌కు మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంపై జగన్, లోకేష్ మధ్య సోషల్ మీడియా వేదికగా వార్ నడిచింది. కూటమి ప్రభుత్వ వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్ చేయలేదని జగన్ విమర్శలు చేస్తే .. చిన్న పిల్లలకు అందించే చిక్కీల్లో సైతం డబ్బులు ఎగ్గొట్టిన వైసీపీ అధినేత జగన్ ఇప్పుడు సుద్దపూసలా కబుర్లు చెప్పడం వింతగా ఉందని మంత్రి నారా లోకేశ్ కౌంటర్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్న జగన్ విమర్శలపై ట్విట్టర్ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ ట్విట్టర్ వేదికగా విమర్శలు చేశారు. జగన్ ఏం పోస్టు చేశారంటే"కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించకపోవడంతో చదువులు మానుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వారిపై చంద్రబాబు కక్షకట్టినట్టు వ్యవహరిస్తున్నారు. ఒంగోలు జిల్లా జె.పంగులూరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, ఫీజులు కట్టలేక పనులకు వెళ్తున్న విద్యార్థి కథనం ఆవేదన కలిగించింది." అని దానికి సంబంధించిన పేపర్ క్లిప్పింగ్ కూడా పోస్టు చేశారు. అసలు విద్యార్థులకు డబ్బులు ఎగ్గొట్టిన వైసీపీ అధినేత జగన్ ఇప్పుడు సుద్దపూసలా కబుర్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు మంత్రి నారా లోకేష్. మీ నిర్వాకాన్ని నా యువగళం పాదయాత్రలోనే విద్యార్థులు నా దృష్టికి తెచ్చారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని సమస్య పరిష్కరించాం. గత ప్రభుత్వ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని, విద్యార్థుల సర్టిఫికెట్లను తక్షణమే అందజేయాల్సిందిగా కళాశాలలను ఆదేశించాం. ఇకపై ఫీజు రీఎంబర్స్ మెంట్ సొమ్మును నేరుగా కళాశాలలకు చెల్లించేలా ఇటీవలే నిర్ణయం కూడా తీసుకున్నాం.' అని మంత్రి పేర్కొన్నారు.'

త్రీవీలర్స్ బ్యాన్ చేయండి: జేసీ ప్రభాకర్ రెడ్డి

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. రోడ్డు ప్రమాదాలకు కారణం ఆటోలేనని.. వాటిని నిషేధించాలని అన్నారు. మైనర్లు, డ్రైవర్ల మద్యం మత్తులోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని.. అయితే వాటిపై అధికారులు కన్నెత్తి చూడడం లేదని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ రెండు రోజులు హడావుడి చేసి వదిలేస్తారని మండిపడ్డారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతదేహాలను ఆయన పరిశీలించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా సరిపోదని.. బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. కాగా, అనంతపురం జిల్లాలో శనివారం జరిగిన ఘోర ప్రమాదంలో 8 మంది మృతి చెందగా.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

అర్ధరాత్రి అనుమతులపై దర్యాప్తు!

జగన్-అదానీ విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి

చంద్రబాబుకు వైఎస్ షర్మిల బహిరంగ లేఖ

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): మాజీ సీఎం జగన్ అదానీతో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను రద్దు చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆమె బహిరంగ లేఖ రాశారు. అదానీతో ఒప్పందం రాష్ట్రానికి పెను భారమని.. ఈ అక్రమ ఒప్పందాలతో 25 ఏళ్ల పాటు పాటు ప్రజలపై రూ.లక్షన్నర కోట్ల భారం పడుతుందని అన్నారు. 'విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో గౌతమ్ అదానీ నుంచి రూ.1750 కోట్ల ముడుపులు అందుకున్న జగన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. ఈ విషయంలో లంచాలు తీసుకున్నట్లు ఇప్పటికే అమెరికాకు చెందిన దర్యాప్తు సంస్థలు నిరూపించాయి. జగన్ ఏపీ పరువును తీశారు. లంచాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు. అదానీ దగ్గర నుంచి గుజరాత్ యూనిట్ ధర రూ.1.99 పైసలకు కొంటుంటే, ఏపీ మాత్రం యూనిట్ ధర రూ.2.49 పైసలుగా అగ్రిమెంట్ చేసుకున్నారు.' అని షర్మిల మండిపడ్డారు. అదానీతో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు మొత్తం సీఎంవో నుంచే నడిచాయని.. ఈ విషయాన్ని స్వయంగా అప్పటి విద్యుత్ శాఖ మంత్రి ఒప్పుకొన్నట్లు షర్మిల చెప్పారు. 'ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కూడా ఎలాంటి ప్రజాభిప్రాయం సేకరించకుండా, అదే కంపెనీ ఇతర రాష్ట్రాల్లో చేసుకున్న ఒప్పందాలను పరిశీలించకుండా వెంటనే ఆమోద ముద్ర వేశారు. అర్ధరాత్రి హడావుడిగా చేసిన అనుమతుల వెనుక దర్యాప్తు జరగాలి. అత్యవసరంగా సోలార్ పవర్‌ను కొనాల్సిన అవసరం ఏమొచ్చిందో, నిజానిజాలు ఏంటో రాష్ట్ర ప్రజలకు తెలియాలి. అదానీతో ఒప్పందాల రద్దుతో పాటు కంపెనీని తక్షణమే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. అలాగే 2019 నుంచి 2024 మధ్య అదానీతో జరిగిన ఒప్పందాల మీద పూర్తిగా విచారణ జరగాలి.' అని లేఖలో ప్రస్తావించారు.

సైకిల్‌పై పార్లమెంట్‌కు టీడీపీ ఎంపీ

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లారు. పసుపు రంగు సైకిల్‌పై పసుపు రంగు అంగీ, తెల్ల దోవతి, తలకు తలపాగా ధరించి ఆయన పార్లమెంటుకు చేరుకు న్నారు. అయితే అప్పల నాయుడు ఆ విధంగా పార్లమెంట్ వెళ్లడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోతుంది. దట్టంగా పొగమంచు కమ్ముకుని ఉదయం తొమ్మిదింటి వరకు కూడా ఏమీ కనపడని దుస్థితి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో కాలుష్య నియం త్రణ కోసం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అప్పలనాయుడు గుర్తుచేశారు.

విద్యార్థుల్లో సత్ప్రవర్తన పెంపొందించేందుకు కృషిచేస్తా

తన వంతు సలహాలు, సహకారం అందిస్తా

ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

సీఎం చంద్రబాబుతో చాగంటి కోటేశ్వరరావు భేటి

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రముఖ ప్రవచనకర్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు భేటి అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతలో నైతిక విలువలు పెంచేందుకు ప్రయత్నించాలని సీఎం చంద్రబాబు చాగంటికి సూచించారు. భారతీయ కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అన్నారు. స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల్లో ప్రవచనాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో మంచిని పెంచే ప్రయత్నం చేయొచ్చని సీఎం అన్నారు. అంతేకాక..మంచి చదువు, ఉద్యోగం, భవిష్యత్?తో పాటు నైతిక విలువలు కూడా అవసరమని, అప్పుడే మంచి సమాజం ఆవిష్కృతం అవుతుందని ఆ దిశగా అందరూ కృషి చేయాలని అన్నారు. ప్రపంచంలో మరే దేశానికి లేని ఉన్నతమైన సంస్కృతి, సాంప్రదాయాలు మన సొంతం అని, వాటిని ఈ తరానికి, భవిష్యత్ తరాలకు అందించాలని చంద్రబాబు అన్నారు. మహిళలను గౌరవించడం, పెద్దలు, తల్లితండ్రుల మాటలకు విలువ ఇవ్వడం వంటివి యువతకు నేర్పించాలన్నారు. మారుతున్న కాలంలో అనేక అంశాలు విద్యార్థులు, యువతపై దుష్ప్రభావం చూపుతున్నాయని నైతిక విలువల పతనానికి ఇవి కారణం అవుతున్నాయని అన్నారు.మరోవైపు చాగంటి కోటేశ్వరరావు ఈరోజు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని నివాసంలో లోకేశ్?తో సమావేశం అయ్యారు. విద్యార్థుల్లో మహిళలు, పెద్దలు, గురువులపై గౌరవం పెంపొందించేలా ప్రత్యేకంగా పాఠ్యాంశాలు రూపొందించాలని దీని కోసం అమూల్యమైన సలహాలు అవసరమని చాగంటికి లోకేశ్? చెప్పారు. అయితే విద్యార్థుల్లో సత్ప్రవర్తన పెంపొందించేందుకు తన వంతు సలహాలు, సహకారం అందిస్తానని ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. కాగా, చాగంటి కోటేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నైతిక విలువల సలహాదారుగా ఇటీవల నియమించిన విషయం తెలిసిందే.

విద్యార్థులపై కక్షకట్టిన చంద్రబాబు

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది

కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో తిరోగమనం

డిసెంబర్ నాటికి 3500 కోట్ల బకాయిలు

ప్రభుత్వంపై ట్విట్టర్ వేదికగా వైఎస్ జగన్ విమర్శలు

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ ట్విట్టర్ వేదికగా విమర్శలు చేశారు. జగన్ ఏం పోస్టు చేశారంటే"కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించకపోవడంతో చదువులు మానుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వారిపై చంద్రబాబు కక్షకట్టినట్టు వ్యవహరిస్తున్నారు. ఒంగోలు జిల్లా జె.పంగులూరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, ఫీజులు కట్టలేక పనులకు వెళ్తున్న విద్యార్థి కథనం ఆవేదన కలిగించింది." అని దానికి సంబంధించిన పేపర్ క్లిప్పింగ్ కూడా పోస్టు చేశారు. చంద్రబాబు రాగానే అన్ని రంగాల్లోనూ తిరోగమనమే కనిపిస్తోందని విమర్శించారు జగన్. ముఖ్యంగా విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారన్నారు. అమ్మ ఒడిని, ఇంగ్లీష్ మీడియంను, 3వ తరగతి నుంచి టోఫెల్, 3వ తరగతి నుంచే సబ్జెక్ట టీచర్లు, సీబీఎస్ఈ, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం, 8వ తరగతి పిల్లలకు ట్యాబులు, బైజూస్ కంటెంట్, నాడు-నేడు ఇలా అన్నింటినీ రద్దుచేసిందన్నారు. 1-12వ తరగతి విద్యార్థులను, వారి తల్లులను కూడా దెబ్బతీశారని ధ్వజమెత్తారు. వసతిదీవెన, విద్యాదీవెన నిలిపేసి, డిగ్రీ, ఇంజినీరింగ్, డాక్టర్ చదువుతున్నవారినీ ఇబ్బందిపెడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి త్రైమాసికం పూర్తికాగానే తల్లుల ఖాతాలో జమచేసే వాళ్లమని అన్నారు. ఇలా గత విద్యాసంవత్సరం డిసెంబర్ త్రైమాసికం వరకూ రూ. 12,609 కోట్లు ఒక్క విద్యాదీవెనకే ఖర్చు చేశామని తెలిపారు. తలరాతలను మార్చేది చదువులు మాత్రమేనని గట్టిగా నమ్ముతూ వైయస్సార్‌సీపీ హయాంలో మొత్తం ఈ రెండు పథకాలకే రూ.18వేల కోట్లు వరకూ ఖర్చు చేశామని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా జనవరి-మార్చి త్రైమాసికానికి, ఏప్రిల్‌లో వెరిఫికేషన్ చేసి మే నెలలో ఇవ్వాల్సిన ఫీజు డబ్బులు వేయనీయకుండా కూటమి పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేశాయన్నారు. పోనీ ఎన్నికలైన తర్వాత జూన్‌లో అయినా ఇచ్చారా అంటే అదీలేదన్నారు. ఏప్రిల్‌లో ఇవ్వాల్సిన వసతి దీవెన, ఏప్రిల్-జూన్, తర్వాత జులై-సెప్టెంబరు త్రైమాసికాలకు సంబంధించి ఫీజులు చెల్లింపులో అడుగూ ముందుకు పడ్డంలేదన్నారు. ఇప్పుడు అక్టోబరు-డిసెంబరు త్రైమాసికం కూడా సగం గడిచిపోయిందన్నారు. సుమారు రూ.2,800 కోట్లకుపైగా ఫీజులు రీయింబర్స్ చేయాల్సి ఉందని వివరించారు. మరో రూ.1,100 కోట్లు వసతిదీవెన బకాయిలు ఉన్నాయన్నారు. మొత్తంగా డిసెంబర్ నాటికి రూ.3,900 కోట్లకు చేరుకుంటాయని తెలిపారు.

పుష్ప 2 సినిమాను ఆపలేరు

ఎస్పీకి ఫిర్యాదు చేసిన అంబటి రాంబాబు

అమరావతి, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): ఏపీలో వైసీపీ నేతలు అల్లు అర్జున్ కు మద్దతుగా మాట్లాడేందుకు లేని పోని వివాదాల్ని తెరపైకి తెస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా తమ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తల్ని అరెస్టు చేస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన అంబటి రాంబాబు అక్కడ మీడియాతో మాట్లాడారు. పుష్ప 2 ప్రస్తావన తీసుకు వచ్చారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా పుష్ప-2 సినిమాని ఆపలేరని ప్రకటించారు. గతంలో ఎన్టీఆర్ సినిమాని కూడా ఆపాలని ప్రయత్నించారు కానీ ఆపగలిగారా అని ప్రశ్నించారు. తాను పుష్ప-2 కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానన్నారు.. పుష్ప పార్ట్ 1 హాలీవుడ్ రేంజ్‌లో ఉందన్నారు. అందరినీ తలదన్నే స్థాయికి అల్లు అర్జున్ ఎదిగారు... అందుకే కొందరికి కడుపు మండుతున్నట్లు ఉందన్నారు.అంబటి రాంబాబు మంత్రిగా ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ సినిమాలు విడుదలైన తర్వాత రివ్యూలు , కలెక్షన్లను నెగెటివ్ గా చెప్పేవారు. ఇప్పుడు అల్లు అర్జున్ గురించి పాజిటివ్ సినిమా విడుదల కాక ముందే స్పందిస్తున్నారు.

కాంగ్రెస్ బ్రాండ్ కోల్పోయింది: కంగనా

న్యూఢిల్లీ,నవంబర్25 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అఖండ విజయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సాధించిన గొప్ప విజయాల్లో ఒకటిగా ఎంపీ కంగనా రనౌత్ అభివర్ణించారు. మీడియా ప్రతినిధులను ఉద్దేశించి, ఎంపీ కంగనా రనౌత్ మాట్లాడుతూ.. "ప్రధానమంత్రి మోదీ ప్రపంచంలోనే గొప్ప నాయకుడు, నేడు, భారతదేశ ప్రజలు బ్రాండ్‌లను నమ్ముతున్నారు, స్వాతంత్ర్యం తర్వాత, కాంగ్రెస్ పార్టీని కూడా బ్రాండ్‌గా పిలిచే సమయం ఉంది. కానీ నేడు, పార్టీ ప్రాంతీయ పార్టీగా దిగజారింది." అని ఆమె వ్యాఖ్యానించారు. మీడియా ప్రతినిధులను ఉద్దేశించి, ఎంపీ కంగనా రనౌత్ మాట్లాడుతూ.. "ప్రధానమంత్రి మోదీ ప్రపంచంలోనే గొప్ప నాయకుడు, నేడు, భారతదేశ ప్రజలు బ్రాండ్‌లను నమ్ముతున్నారు, స్వాతంత్ర్యం తర్వాత, కాంగ్రెస్ పార్టీని కూడా బ్రాండ్‌గా పిలిచే సమయం ఉంది. కానీ నేడు, పార్టీ ప్రాంతీయ పార్టీగా దిగజారింది." అని ఆమె వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ బ్రాండ్ హోదాను కోల్పోయిందని, ఇప్పుడు ప్రాంతీయ అస్తిత్వానికి దిగజారిందని అన్నారు.

కాంగ్రెస్ ఇగోని పక్కన పెట్టాలి: కల్యాణ్ బెనర్జీ

న్యూఢిల్లీ,నవంబర్25 (ఋషి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఇగోని పక్కన పెట్టాలని, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని 'ఇండియా' కూటమికి లీడర్‌గా గుర్తించాలని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసిన విషయం తెలిసిందే. ఆ పార్టీ పశ్చిమ బెంగాల్‌లో ఐదు అసెంబ్లీ స్థానాలను నిలుపుకోవడమే కాకుండా, ఇంతకుముందు బీజేపీ ప్రాతినిధ్యం వహించిన మదరిహట్‌లోనూ గెలుపొందింది. మరోవైపు మహారాష్ట్ర ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోయింది.దీంతో కాంగ్రెస్‌పై కల్యాణ్ బెనర్జీ విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, బీజేపీకి సవాలు విసరడానికి ఏకీకృత, నిర్ణయాత్మక నాయకత్వం కావాలని చెప్పారు. మమతా బెనర్జీ తన నాయకత్వాన్ని ఇప్పటికే నిరూపించుకున్నారని, ప్రతిపక్ష కూటమికి నాయకత్వం వహించడానికి ఆమె సరైన నాయకురాలని అన్నారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ఇటీవలి ఎన్నికలలో తమ వైఫల్యాలను అంగీకరించాలని చెప్పారు. వ్యక్తిగత లక్ష్యాల కంటే ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. వారు తమ అహాన్ని పక్కనపెట్టాలని, మమతా బెనర్జీని ఇండియా కూటమి నాయకురాలిగా అంగీకరించాలని చెప్పారు.

ఈవీఎంలలో అవకతవకలు: సంజయ్ రౌత్

న్యూఢిల్లీ,నవంబర్25 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్ర ఎన్నికల వేళ ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. బ్యాలెట్ పేపర్లను వాడి మహారాష్ట్రలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని సంజయ్ రౌత్ సోమవారం డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి 288 స్థానాలకు గాను 230 స్థానాలను గెలుచుకున్న విషయం తెలిసిందే. ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాడీ 46 స్థానాలను గెలుచుకుంది. శివసేన (యూబీటీ) 95 సీట్లలో పోటీ చేయగా కేవలం 20 మాత్రమే గెలుచుకుంది. దీనిపై ముంబైలో సంజయ్ రౌత్ మీడియాతో మాట్లాడారు. ఈవీఎంలకు సంబంధించి తమకు దాదాపు 450 ఫిర్యాదులు అందాయని తెలిపారు. పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ ఈ అంశాలపై ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఈ ఎన్నికలు న్యాయబద్ధంగా జరిగాయని ఎలా చెప్పగలమని ప్రశ్నించారు. అందుకే ఫలితాలను పక్కనబెట్టి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. కొందరు మహాయుతి అభ్యర్థులు భారీ తేడాతో విజయం సాధించడంపై సంజయ్ రౌత్ అనుమానాలు వ్యక్తం చేశారు. వారు చేసిన విప్లవాత్మక పనులు ఏమున్నాయని, అంత భారీ మెజార్టీతో వారు ఎలా గెలుస్తారని సంజయ్ రౌత్ అన్నారు.

రూ.1000 తగ్గిన పసిడి

గ్లోబల్ మార్కెట్‌లో
1.45 శాతం పడిపోయిన గోల్డ్

హైదరాబాద్,నవంబర్25 (ఋషి ప్రతినిధి): యూఎస్ డాలర్ బలం కోల్పోవడంతో పాటు ప్రాంతీయ-రాజకీయ ఉద్రిక్తతలు క్రమంగా సద్దుమణగడంతో గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్ ఈ రోజు 1.45 శాతం పడిపోయింది. ప్రస్తుతం, అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 2,672 డాలర్ల వద్దకు చేరింది. ఈ రోజు, మన దేశంలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ?(24 కేరెట్లు) ధర 1,090 రూపాయలు, ఆర్నమెంట్ గోల్డ్ ?(22 కేరెట్లు) ధర 1,000 రూపాయలు, 18 కేరెట్ల బంగారం రేటు 820 రూపాయల చొప్పున తగ్గాయి. కిలో వెండి ధర 500 రూపాయలు దిగి వచ్చింది.హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 78,550 వద్దకుబీ 22 క్యారెట్ల బంగారం ధర రూ. 72,000 వద్దకుబీ 18 క్యారెట్ల బంగారం ధర రూ. 58,910 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లో రూ. 1,00,500గా ఉంది. ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది.విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 78,550 వద్దకుబీ 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర రూ. 72,000 వద్దకుబీ 18 క్యారెట్ల బంగారం ధర రూ. 58,910 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర రూ. 1,00,500 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్‌లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది. మన దేశంలో, 10 గ్రాముల 'ప్లాటినం' ధర రూ. 26,140 వద్ద ఉంది. హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం సహా దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధర అమల్లో ఉంది. పసిడి, వెండి, ప్లాటినం సహా అలంకరణ లోహాల ధరలు ప్రతిరోజూ మారుతుంటాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో గోల్డ్ రేట్లు పెరగడం/ తగ్గడం వల్ల మన దేశంలోనూ ధరలు మారుతుంటాయి. ప్రపంచ మార్కెట్‌లో అలంకరణ లోహాల రేట్లు పెరగడానికి/ తగ్గడానికి చాలా కారకాలు పని చేస్తాయి. ప్రాంతీయ-రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, కేంద్ర బ్యాంకుల వద్ద పసిడి నిల్వలు, వడ్డీ రేట్లలో మార్పులు, వివిధ జ్యువెలరీ మార్కెట్లలోని డిమాండ్‌లో హెచ్చుతగ్గులు వంటి ఎన్నో అంశాలు అలంకరణ లోహాల ధరలను ప్రభావితం చేస్తాయి.

రాజ్యాంగ ప్రవేశికపై
సుప్రీం కీలక తీర్పు

న్యూఢిల్లీ,నవంబర్25 (ఋషి ప్రతినిధి): రాజ్యాంగ ప్రవేశిక అంశంపై సోమవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ప్రవేశికలో లౌకిక, సామ్యవాద పదాలు తొలగించాలని దాఖలైన పిటిషన్లను తాజాగా కొట్టివేసింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో సామ్యవాద, లౌకిక అనే పదాలను జోడిస్తూ 1976లో చేసిన 42వ సవరణను సవాలు చేస్తూ సుప్రీంకోర్టు లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పదాలను తొలగించాలని కోరుతూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు ఈ పిటిషన్లు వేశారు. ఆ సవరణపై పార్లమెంట్‌లో చర్చే జరగలేదని వారు వాదించారు. ఈ పిటిషన్లపై పలు వాదనలు విన్న సుప్రీంకోర్టు నవంబర్ 22న తీర్పు రిజర్వ్ చేసి, తాజాగా ఆ పిటిషన్లను కొట్టివేసింది. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని.. వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని గత విచారణల్లో సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. 'సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మీరు దీనిని మరో రకంగా చూడకూడదు. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే.. అని పేర్కొంది.

అండమాన్ తీరంలో భారీగా డ్రగ్స్ పట్టివేత

న్యూఢిల్లీ, నవంబర్ 25 (ఋషి ప్రతినిధి): అండమాన్ తీరంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఫిషింగ్ బోట్ నుంచి దాదాపు 5 టన్నుల డ్రగ్స్‌ను ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కోస్ట్‌గార్డ్ చరిత్రలోనే ఇంత భారీ మొత్తంలో మాదక ద్రవ్యాలు పట్టుకోవడం ఇదే తొలిసారి అని రక్షణ అధికారులు తెలిపారు. 'అండమాన్ తీరంలో ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. సుమారు 5 టన్నుల డ్రగ్స్‌ను పట్టుకుంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ చరిత్రలోనే ఇంత భారీ మొత్తంలో మాదకద్రవ్యాలు పట్టుకోవడం ఇదే తొలిసారి' అని డిఫెన్స్ అధికారి ఒకరు తెలిపారు.

జేఈఈకి 3.8 లక్షల మంది దరఖాస్తు

జనవరి 22 నుంచి
జేఈఈ మొదటి సెషన్ పరీక్షలు

న్యూఢిల్లీ,నవంబర్25 (ఋషి ప్రతినిధి): దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీల్లో బీటెక్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) 2025 జనవరి సెషన్ దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. గడువు సమయం ముగిసే నాటికి సుమారు 13.8 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అక్టోబర్ 28న ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియలో మొదటి రెండు వారాల్లో కేవలం 5.10 లక్షల మందే దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఈసారి దరఖాస్తుల సంఖ్య తగ్గిపోవచ్చని అనుకున్నా, చివరికి అంచనాలను అధిగమిస్తూ 13.8 లక్షల మందికి పైగా దరఖాస్తులు అందాయి. నవంబర్ 22 నాటికి దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. కానీ, గత ఏడాది తో పోల్చితే ఈసారి స్వల్పంగా దరఖాస్తులు తగ్గినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు ఎన్టీఏ ఇంకా వెల్లడించలేదు. అయితే, జేఈఈ జనవరి సెషన్ పరీక్షలు 2025 జనవరి 22 నుంచి 31 వరకు జరగనున్నాయి. రెండవ సెషన్ ఏప్రిల్ 1 నుంచి 8 వరకు ఉంటుంది. అడ్మిట్ కార్డులు 2025 జనవరి 19 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది జేఈఈ పరీక్షలో కొన్ని మార్పులు చేసారు. 2020 కోవిడ్ సమయంలో జేఈఈ సెక్షన్‌లో ఉన్న ఐచ్ఛిక ప్రశ్నల విధానాన్ని తొలగించి, 10 ప్రశ్నలకు బదులుగా 5 ప్రశ్నలు మాత్రమే ఇవ్వడం ప్రారంభించారు.అలాగే, న్యూమరికల్ వాల్యూ ప్రశ్నలకు నెగెటివ్ మార్కింగ్ విధానం ప్రవేశ పెట్టారు. అంటే, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల మాదిరిగానే ఈ ప్రశ్నలకు తప్పుల కోసం మార్కుల కోత ఉంటుంది. అదే విధంగా, వయోపరిమితి గురించి సడలింపులు తీసుకున్నారు. ఇప్పుడు 12వ తరగతి అర్హత ఉన్న ఎవరైనా వయసుతో సంబంధం లేకుండా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు

ముంబయి,నవంబర్25 (ఋషి ప్రతినిధి): దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, మహారాష్ట్రలో భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి భారీ విజయం సాధించిన నేపథ్యంలో సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సెన్సెక్స్ మళ్లీ 80వేల ఎగువకు చేరింది. నిఫ్టీ 24,200 పాయింట్ల ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 80,193.47 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,117.11) లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 1300 పాయింట్లకు పైగా లాభపడి 80,473.08 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 992.74 పాయింట్ల లాభంతో 80,109.85 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 314.65 పాయింట్ల లాభంతో 24,221.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ కాస్త బలపడి 84.30కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎల్‌అండ్‌టీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2672 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బీఎస్ఈ సెన్సెక్స్ సూచీలోకి జొమాటోను తీసుకొంటున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఇవాళ ఆ కంపెనీ షేరు రాణించింది. ఇంట్రాడేలో 7 శాతం మేర లాభపడిన ఆ షేరు.. చివరికి 3.29 శాతం లాభంతో రూ.272.90 వద్ద స్థిరపడింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు 2.40 శాతం కుంగి 953.35 వద్ద ముగిసింది.



శివసేన శాసనసభా పక్ష నేతగా ఆదిత్య ఠాక్రే

ముంబై,నవంబర్25 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) శాసనసభా పక్ష నేతగా ఆయన కుమారుడు ఆదిత్య ఠాక్రేను ఎన్నుకున్నారు. అసెంబ్లీలో ఆ పార్టీ గ్రూప్ నేతతోపాటు పార్టీ చీఫ్ విప్ పదవులను భర్తీ చేశారు. సోమవారం ముంబైలో శివసేన (యూబీటీ) శాసన సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆదిత్య ఠాక్రేను ఎన్నుకున్నారు. ఆ రాష్ట్ర అసెంబ్లీలో పార్టీ గ్రూప్ లీడర్‌గా మాజీ మంత్రి భాస్కర్ జాదవ్, పార్టీ చీఫ్ విప్‌గా సునీల్ ప్రభు ఎన్నికయ్యారు. శివసేన (యూబీటీ) శాసనసభ్యుల సమావేశం తర్వాత ఆ పార్టీ సీనియర్ నేత అంబాదాస్ దన్వే ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వర్లీ నియోజకవర్గం నుంచి ఆదిత్య ఠాక్రే పోటీ చేశారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన మిలింద్ దేవరాపై 8,801 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అయితే 2019 ఎన్నికల్లో 67,427 ఓట్ల మెజార్టీతో ఆదిత్య ఠాక్రే గెలిచారు. ఈ ఓట్ల మార్జిన్ ఈసారి బాగా తగ్గింది.

ఆదానీ జగన్‌కు లంచం విచారణపై
ఈడీ ముందుకు రాదా: సిపిఎం

విజయవాడ,నవంబర్25 (ఋషి ప్రతినిధి): అదానీ గ్రూప్ నుంచి లంచం తీసుకున్నారనే ఆరోపణలపై వైకాపా అధ్యక్షుడు జగన్‌ను ఈడీ ఎందుకు ప్రశ్నించడం లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రశ్నించారు. అదానీ విద్యుత్ ఒప్పందాల్లో ముడుపుల వ్యవ హారం అతిపెద్ద కుంభకోణం అన్నారు. అదానీతో జగన్ కుమ్మక్కై ప్రజలపై భారం మోపేలా చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీఎం చంద్రబాబును రాఘవులు కోరారు. పార్టీ నేతలు ఎంఏ బేబీ, వి.శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐని ప్రయోగించే ప్రధాని నరేంద్ర మోదీ.. జగన్‌ను ఎందుకు వదిలేశారని రాఘవులు నిలదీశారు. అదానీ, జగన్ కుమ్మక్కు వ్యవహారాలపై విచారణ జరిపించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే, ముడుపుల వ్యవహారంపై పార్లమెంటు సమావేశాల్లో చర్చించి జేపీసీతో విచారణ జరిపించాలన్నారు.

వైష్ణో దేవి రోప్‌వే ప్రాజెక్టుపై స్థానికుల ఆందోళన

రియాసి, నవంబర్25 (ఋషి ప్రతినిధి): జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లాలోని కత్రాలో వైష్ణో దేవి పుణ్యక్షేత్రానికి ట్రెక్ మార్గంలో చేపడుతున్న రోప్‌వే ప్రాజెక్టుపై స్థానికులు ఆందోళన తెలిపారు. ఆ ప్రాజెక్టు వల్ల తమ దుకాణాలు కోల్పోవాల్సి వస్తుందని, ఉపాధి దొరకదని స్థానికులు అంటున్నారు.స్థానికులతో పాటు పోనీ సర్వీస్ ప్రొవైడర్లు కత్రా బేస్ క్యాంపు వద్ద పోలీసులతో ఘర్షణకు దిగారు. దీంతో పలువురు గాయపడ్డారు. శ్రీ మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్రం బోర్డు తారాకోట్ మార్గ్‌ని, సాంజీ ఛత్‌ను కలుపుతూ రూ.250 కోట్ల ప్యాసింజర్ రోప్‌వే ప్రాజెక్ట్‌ను కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి కత్రాలో స్థానికులు నిరసనలు తెలుపుతున్నారు. ఈ రోప్‌వే పూర్తయితే యాత్రికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇవాళ వందలాది మంది దుకాణదారులు, పోర్టర్లు, పోనీ సర్వీస్ ప్రొవైడర్లు నిరసనలో పాల్గొని "భారత్ మాతా కీ జై" అని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.పోలీసులపై వారు రాళ్లు రువ్వుతూ, దాడి చేస్తూ కలకలం రేపారు. సీఆర్పీఎఫ్ బలగాల వాహనం ఆ ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతం మీదుగా వెళ్తున్న సమయంలో స్థానికులు దాన్ని అడ్డుకుని ఘర్షణకు దిగారు. పోలీసులకు, స్థానికులకు మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

రాజీనామా ప్రచారంలో నిజం లేదు

మహా వికాస్ అఘాడీ చెక్కుచెదరకుండా ఉంటుంది
మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే

ముంబై,నవంబర్25 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఘోర ఓటమి చవిచూడడంతో..దీనికి బాధ్యతగా మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఆ పార్టీ సీనియర్ నేత నానా పటోలే రాజీనామా చేసారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రచారాన్ని పటోలే ఖండించారు. రాజీనామా చేసినట్టు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని, తాను రాజీనామా చేయలేదని, మహా వికాస్ అఘాడీ చెక్కుచెదరకుండా ఉంటుందని తేల్చి చెప్పారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నానా పటోలే 2021లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో.. నానా పటోలే నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ.. మొత్తం 48 లోక్‌సభ సీట్లకు గానూ 17 స్థానాల్లో పోటీ చేసింది. అందులో 13 స్థానాలను గెలుచుకుని అద్భుతమైన ప్రదర్శన చేసింది. దీంతో మహా వికాస్ ఆఘాడీ కూటమి ఈసారి ఎలాగైనా మహారాష్ట్రలో అధికారాన్ని చేజిక్కించుకుంటుందని అంతా భావించినా.. అది జరగలేదు. కనీసం ఎగ్జిట్ పోల్స్ సంస్థలు చెప్పిన అంచనాలను కూడా అందుకోవడంలో మహా వికాస్ ఆఘాడీ కూటమి విఫలం అయ్యింది.

రాష్ట్ర స్థాయి రోడ్లకు టోల్‌టాక్స్

ప్రయోగాత్మకంగా గోదావరి జిల్లాల నుంచే ప్రారంభం

అమరావతి, నవంబర్ 25 (ఆర్ఎన్ఎ): అభివృద్ధి సంస్కరణలు ఎప్పుడూ ప్రభుత్వానికి కత్తి మీద సాములానే ఉంటాయి. ఒక్కోసారి ప్రజల్లో మంచి పేరు తెచ్చి పెడితే మరోసారి అదే తీవ్ర వ్యతిరేకతను రగులుస్తుంది. ఇప్పుడు ఏపీలోని కూటమి ప్రభుత్వం అలాంటి ప్రయోగాన్ని చేపడుతోంది. అదే జిల్లా రోడ్లకు సైతం టోల్ టాక్స్ వర్తింపజేయాలనే ఆలోచన. ప్రయోగాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా 18 రోడ్లను ఎంపిక చేసి టోల్ టాక్స్ ఆచరణలో పెట్టబోతుంది. ఈ మధ్య జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నేషనల్ హైవేలకు పిలిచినట్లుగానే ఏపీలోని జిల్లా రోడ్లకు సైతం టెండర్లు పిలిచి అభివృద్ధి చేస్తామన్నారు చంద్రబాబు. ఈ పనిని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలుగా అప్పజెప్పాలి అనేది ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం తమ దగ్గర ఉన్న కొంత మొత్తం (900కోట్లు) తో రాష్ట్రంలోని రోడ్లకు ఉన్న గుంతలు పూడ్చే పనిలో ఉన్నామని వివరించారు. వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలంటే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పజెప్పడమే మంచి ఆలోచన అన్నట్టుగా చెప్పరాయన. అయితే ఈ ఆలోచన ఆచరణలోకి రావాలంటే రాష్ట్రంలోని రోడ్లకు కూడా హైవేలకు ఉన్నట్టే టోల్ టాక్స్ వసూలు చేయాల్సి ఉంటుంది అని సమాచారం. గ్రామాలు మండలాలు మినహాయించి పట్టణాలను కలిపే రాష్ట్ర స్థాయి రోడ్లకు టోల్ టాక్స్‌లు విధిస్తే ఎలా ఉంటుంది అని ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేస్తుంది. అయితే ఈ టోల్ టాక్స్ నుంచి బైకులు, ట్రాక్టర్లు, చిన్న చిన్న ట్రక్కులు, ఆటోలను మినహాయించనున్నట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 18 ఆర్ అండ్ బీ రహదార్లను గుర్తించినప్పటికీ ముందుగా ఈ ప్రయోగాన్ని గోదావరి జిల్లాల నుంచి ప్రారంభించే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. ఇలా జిల్లా స్థాయి రోడ్ల నుంచి టోల్ టాక్స్ వసూలు చేయడం వల్ల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్‌లో రోడ్లు అభివృద్ధి చేయడం ఈజీ అవుతుంది. కానీ ఇందులో మరో సమస్య ఉందనేది ప్రజా సంఘాల వాదన. ఇప్పటికే రాష్ట్రంలో నిత్యవసర ధరలు పెరిగి పోయాయి. అదికాక ఆల్రెడీ హైవేలకు టాక్స్‌లు కడుతున్నారు ప్రజలు. ఇప్పుడు రాష్ట్రంలో రోడ్లకు కూడా టాక్స్‌లు విధిస్తే అది బూమ్‌రాంగ్ అయ్యే ప్రమాదం లేక పోలేదు. గతంలో విద్యుత్ ఛార్జీల సంస్కరణల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. అబిడ్స్ కాల్పుల ఘటన ఇప్పటికీ చంద్రబాబు పాలనకు ఒక మచ్చలా ఉండిపోయింది. ఇప్పుడు తాజాగా రాష్ట్రస్థాయిలో రోడ్లకు టోల్ టాక్స్‌లు అంటే దాన్ని ప్రజలు ఎలా తీసుకుంటారో అనేది అధికార పార్టీలోనే చర్చను లేవనెత్తుతోంది. అందుకనే ఏపీ ప్రభుత్వం హడావుడిగా ఈ ఆలోచనను ఆచరణలోనికి తెచ్చేయకుండా ముందుగా ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యేలను సూచించింది. మరి ప్రభుత్వ ఆలోచన ఆచరణలో సాఫీగా సాగుతుందా లేదా తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.తొలి విడత 18 రోడ్లను ప్రభుత్వం ఎంపి చేసింది. దీన్ని తర్వాత 68 రోడ్లకు విస్తరిస్తారు. మొదటి విడతలో 1,307 కి.మీ. రోడ్లు పీపీపీ ద్వారా బాగు చేస్తే... రెండో విడతలోని 3,931 కి.మీ.లు త్రిబుల్ పీ విధానంలో రూపురేఖలు మారుస్తారు.

370ని అంబేడ్కర్ వ్యతిరేకించారు

కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్

న్యూఢిల్లీ,నవంబర్25 (ఋషి ప్రతినిధి): రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డా.బీఆర్ అంబేడ్కర్ జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడాన్ని వ్యతిరేకించారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు అది విరుద్ధమని ఆయన భావించారని చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని అంబేడ్కర్ లేనప్పుడు రాజ్యాంగ పరిషత్తు హడావుడిగా ఆమోదించిందన్నారు. విద్యార్థుల కోసం భారత రాజ్యాంగం' పేరుతో దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ఈ విధంగా మాట్లాడారు. రాజ్యాంగ పరిషత్తు ముందుకు వచ్చిన అన్ని అంశాలపై తౌలుత మాట్లాడింది అంబేడ్కర్. నిత్యం అనేక గంటలపాటు లేదా ఒక్కోసారి రోజు మొత్తం దీనిపై చర్చలు జరిగేవి. ఈ చర్చలకు అంబేడ్కర్ సమాధానాలు ఇచ్చేవారు. డిబేట్లలో ఆయనే ఎక్కువగా మాట్లాడినట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ, ఆర్టికల్ 370ని మాత్రం ఆయన వ్యతిరేకించారని అర్జున్ రామ్ మేఘ్‌వాల్ పేర్కొన్నారు. అయితే, దీనిని ఆమోదించాలని జవహర్‌లాల్ నెహ్రూ పట్టుబట్టారని, ముసాయిదా కమిటీలోని మరో సభ్యుడికి దీని ఆమోదం బాధ్యత అప్పగించారని అన్నారు. ఆమోదం తెలిపే సమయంలో అంబేడ్కర్ అక్కడ లేరని, ఆసుపత్రికి వెళ్లారని అన్నారు.

లేట్ విషయంలో నేనేం చేయలేను : దేవీశ్రీ ప్రసాద్

సినీ ఇండస్ట్రీలో కొన్ని కాంబినేషన్స్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. కొన్ని కాంబోల్లో సినిమా వస్తుందంటే చాలు బాక్సాఫీస్ రికార్డుల గురించే అంతటా చర్చ నడుస్తుంటుంది. అలాంటి జాబితాలో టాప్‌లో ఉంటుంది మైత్రీ మూవీ మేకర్స్-సుకుమార్-దేవీ శ్రీ ప్రసాద్ కాంబినేషన్. ఈ ముగ్గురి కాంపౌండ్ నుంచి వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించాయని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే పుష్ప 2 ది రూల్ సినిమా విషయంలో మాత్రం వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయని టాక్ నెట్టింట వినిపిస్తూనే ఉంది. దీనిక్కారణం ఈ సారి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ విషయంలో డీఎస్పీతోపాటు మరికొందరు సంగీత దర్శకులకు ఇవ్వడమనేది అంతటా నడుస్తున్న చర్చ. ఈ విషయం నిజమేనని పుష్ప 2 ది రూల్ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో మరోసారి తేలిపోయింది. ఈవెంట్‌కు దేవి శ్రీ ప్రసాద్ కాస్త ఆలస్యంగా వచ్చాడు. ఈ విషయాన్ని నిర్మాతల్లో ఒకరైన

నవీన్ యేర్నేని డీఎస్పీని అడిగారు. దీంతో స్టేజ్‌పైనే తన సహనాన్ని నవ్వుతూ బయటపెట్టేశాడు దేవీ శ్రీ ప్రసాద్. పాటలు లేటని, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ లేటని తనను అంటూనే ఉంటారని,. ఇప్పుడు కూడా ఫంక్షన్‌కు ఆలస్యంగా వచ్చానని ఫీలయ్యారని, ఈ విషయంలో తననేం చేయమంటారని తనదైన స్టైల్‌లో చురకలంటించాడు డీఎస్పీ. ఎవరూ క్రెడిట్ ఇవ్వరని, తీసుకోవాల్సిందేనని, అది పేమెంట్ అయినా, స్క్రీన్‌పై క్రెడిట్ అయినా తప్పదన్నాడు దేవీ శ్రీ ప్రసాద్. టైంకు పాట ఇవ్వలేదు.. టైంకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇవ్వలేదు. టైంకు ప్రోగ్రామ్ రాలేదని ఎక్కువ కంప్లైట్స్ చేస్తూ ఉన్నాయి. మీకు నా మీద ప్రేమ ఉంది. ఆ ప్రేమ ఉన్నప్పుడు కంప్లైంట్స్ కూడా ఉంటాయన్నాడు డీఎస్పీ. పుష్ప 2 డిసెంబర్ 5న విడుదలవుతున్న నేపథ్యంలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పూర్తి కాలేదని.. సుకుమార్ అండ్ టీం అదనంగా ఎస్ థమన్, అజనీష్ లోక్‌నాథ్, శ్యామ్ సీఎస్‌ను తీసుకోవడం డీఎస్పీకి నచ్చలేదని నెటిజన్లు, మూవీ లవర్స్ చర్చించుకుంటున్నారు. మరి సినిమా విడుదల నేపథ్యంలో ఎలాంటి ప్రభావం పడకుండా డీఎస్పీ, నిర్మాతలు రాజీకి వస్తారా..? అనేది చూడాలి.

హిందీలో ఎన్‌టీఆర్‌కు రెండో సినిమా

జూనియర్ ఎన్టీఆర్ యాక్షన్ డ్రామా ప్రాజెక్ట్ వార్ 2తో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో హృతిక్ రోషన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ సినిమా విడుదల కాకముందే తారక్ మరో హిందీ సినిమాకు సంతకం చేశాడన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం యశ్ రాజ్ ఫిలిమ్స్‌తో తారక్ మరో భారీ సినిమా కోసం చర్చలు జరుపుతున్నాడని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు చెప్పిన కథ తారక్‌కు నచ్చిందట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే 2025 చివరలో ఈ సినిమా లాంచ్ కాబోతుందట. ప్రస్తుతానికి ఆ డైరెక్టర్ ఎవరనేది సస్పెన్స్ నెలకొంది. యశ్ రాజ్ ఫిలిమ్స్ తరచూ స్టార్ యాక్టర్లలో మూడు సినిమాల ఒప్పందం కుదుర్చుకుంటుందని తెలిసిందే. మరి ఎన్టీఆర్ కూడా ఇలాంటి అగ్రిమెంట్‌కు సంతకం ఏమైనా చేశాడా..? అన్నది తెలియాల్సి ఉంది. మొత్తానికి ఏదేమైనా తారక్ త్వరలో హిందీలో రెండో సినిమాకు సైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడన్నది మాత్రం నిజమేనని తాజా వార్తలు క్లారిటీ ఇచ్చేస్తున్నాయి. ఆర్ఆర్ఆర్‌తో గ్లోబల్ స్టార్ డమ్ సంపాదించుకున్న తారక్ ఇక హిందీలో కూడా తన సత్తా చూపించాలని డిసైడ్ అయినట్టు తాజా న్యూస్ హింట్ ఇచ్చేస్తుంది.

మాజీ ప్రేయసితో వెంకటేష్ డ్యుయట్

వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ప్రస్తుతం వెంకటేశ్, ఆయనకు ఎక్స్ గర్ల్ ఫ్రెండ్‌గా నటిస్తున్న మీనాక్షి చౌదరిలపై ఓ అందమైన పాటను దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రీకరించే పనిలో ఉన్నారు. డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో ఈ పాట చిత్రకరణ జరుగుతున్నది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో ఈ ఒక్క పాటను మాత్రమే చిత్రీకరిస్తామని, త్వరలోనే మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెడతామని చిత్ర సమర్పకులు దిల్‌రాజు తెలిపారు. ఐశ్వర్య రాజేష్ మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, నిర్మాత: శిరీష్, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.

భక్తకన్నప్ప రిలీజ్ అప్పుడే...?

టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం కన్నప్ప. బాలీవుడ్ డైరెక్టర్ ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఆయా పాత్రలకు సంబంధించిన లుక్స్ విడుదల చేయగా.. నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. లార్డ్ శివ అపర భక్తుడు కన్నప్ప చిత్రాన్ని 2025 ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రభాస్-మారుతి కాంబినేషన్‌లో వస్తోన్న రాజాసాబ్ ఏప్రిల్ 10న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ లెక్కన ఏప్రిల్‌లో రెండు సినిమాల మధ్య పోరు ఎలా ఉంటుందనేది ఆసక్తిగా మారింది. ఇప్పటికే కన్నప్ప నుంచి లాంచ్ చేసిన టీజర్, పోస్టర్లు నెట్టింట చక్కర్లు కొడుతూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. కన్నప్ప నుంచి షేర్ చేసిన తిన్నడు, ముండడు, చండుడు, మారెమ్మ, పిలక-గిలక పాత్ర సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి. కన్నప్పలో బాలీవుడ్ యాక్టర్ అక్షయ్‌కుమార్ శివుడిగా నటిస్తున్నాడు. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. మంచు విష్ణు తొలి పాన్ ఇండియా సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

నేనంటే తనకు అస్సలు పడదు

- అషికా రంగనాథ్

అందం, అభినయ సామర్థ్యం రెండూ దండిగా ఉన్న కథానాయిక అషికా రంగనాథ్. కలిసొచ్చే అదృష్టం కోసం కళ్లలో దీపాలు పెట్టుకొని మరీ ఎదురు చూస్తున్నది ఈ కన్నడ కస్తూరి. సిద్ధార్థ్‌కి జోడీగా ఈ అందాలభామ నటించిన 'మిస్ యు' సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో సామ్యూల్ నిర్మించిన ఈ చిత్రంపై అషికా ఎంతో ఆశ పెట్టుకున్నది. ఇటీవల ఈ సినిమా గురించి తను మాట్లాడుతూ 'ఇందులో నా పేరు సుబ్బులక్ష్మి. సిద్ధార్థ్ పేరు వాసుదేవ్. నేనంటే తనకు అస్సలు పడదు. కానీ.. అనుకోకుండా నా ప్రేమలో పడిపోతాడు. కారణం ఏంటో తెరపైనే చూడాలి.' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్. ఇంకా మాట్లాడుతూ 'నేను ఎలాంటి పాత్రలనైతే ఇష్టపడతానో.. అలాంటి పాత్ర సుబ్బులక్ష్మి. తను ఇన్నోసెంట్. పక్కా ట్రెడిషనల్. ఓ విధంగా ఇది సుబ్బులక్ష్మి కథే. ఇంతటి మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు రాజశేఖర్‌కీ, హీరో సిద్ధార్థ్‌కీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని తెలిపింది అషికా.

తననెవరో అందరికీ తెలుసు

- రిలేషన్‌షిప్‌పై రష్మిక మందన్న

టాలీవుడ్‌లో మోస్ట్ క్రేజీయెస్ట్ కాంబోలో టాప్‌లో ఉంటుంది విజయ్ దేవరకొండ -రష్మిక మందన్నా. గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాలతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ ఇద్దరు ఆఫ్ స్క్రీన్‌లో కూడా సూపర్ బాండింగ్ మెయింటైన్ చేస్తుంటారని తెలిసిందే. ఎప్పటికప్పుడు కలిసి కనిపిస్తూ నెట్టింట హాట్ టాపిక్‌గా నిలుస్తుంటారు. ఈ ఇద్దరు రిలేషన్‌షిప్‌లో ఉన్నారని చాలా కాలంగా నెట్టింట చర్చ నడుస్తుంది. అయితే దీనిపై మాత్రం అటు రష్మికకానీ, ఇటు విజయ్ దేవరకొండ కానీ సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ వస్తున్నారు. అభిమానుల్లో నెలకొన్న డైలామాకు రష్మిక మందన్నా చెక్ పెట్టేసింది. చెన్నైలో జరిగిన పుష్ప 2 వేడుకలో తన రిలేషన్ షిప్ స్టేటస్‌పై ఓపెన్ అయిపోయింది కన్నడ సోయగం. మీకు ఇష్టమైన వ్యక్తి ఎవరు..? అతడు ఇండస్ట్రీ చెందిన వాడేనా..? అని యాంకర్ అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అతడెవరో అందరికీ తెలుసునని చెప్పింది. రష్మిక సమాధానంతో ఆడిటోరియం అంతా అరుపులు,కేకలతో దద్దరిల్లిపోయింది. విజయ్ దేవరకొండతో ఉన్న రిలేషన్‌షిప్‌పై చాలా కాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు తాజా కామెంట్స్‌తో ఫుల్ స్టాప్ పెట్టేసింది రష్మికమందన్నా. మరోవైపు ఇటీవలే తాను డేటింగ్‌లో ఉన్నానని, ఇప్పుడు తన వయస్సు 35 ఏండ్లు. ఇంకా సింగిల్‌గా ఉండమంటారా..? అందరం ఏదో ఒకటైలో పెళ్లి చేసుకోవాల్సిందే..అంటూ రిలేషన్‌షిప్ గురించి హింట్ ఇచ్చేశాడు విజయ్ దేవరకొండ. ఈ లెక్కన త్వరలోనే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా పెండ్లిపై క్లారిటీ వచ్చే అవకాశాలు లేకపోలేదంటున్నారు సినీ జనాలు.

వర్మ ఫోన్ స్విచ్ఛాఫ్

ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేసులో ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ విచారణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైంది. ముందుగా ఈ కేసులో నవంబర్ 19 (మంగళవారం)న విచారణకు హాజరుకావాలని నోటీసులు పంపినప్పటికీ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో మరోసారి నోటీసులు పంపించిన మేరకు నేడు విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. రాలేనంటూ లాయర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు వర్మ. దీంతో రంగంలోకి దిగిన ఒంగోలు పోలీసులు హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి వెళ్లారు. అయితే వర్మ అక్కడ లేకపోవడంతో పోలీసులు గాలింపు చేపడుతున్నారు. వర్మ ఫోన్ స్విచాఫ్ అని వస్తుందని తెలుస్తోంది. వర్మ తాను కోయంబత్తూరులో ఉన్నట్టు ట్వీట్ చేయగా.. మరోవైపు సోషల్ మీడియాలో అకౌంట్ హ్యాండిల్స్ మాత్రం హైదరాబాద్‌లోనే చూపిస్తున్నాయట. వర్మకు ఓ ప్రముఖ నటుడు తన ఫాంహౌజ్‌లో ఆశ్రయం ఇచ్చినట్టుగా వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఈ మేరకు శంషాబాద్, షాద్ నగర్ దగ్గర రెండు ఫాంహౌజ్‌లపై ఏపీ పోలీసులు ఫోకస్ పెట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వర్మ ఇంతకీ ఎక్కడున్నారో మరి అంటూ నెట్టింట తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు.

295 పరుగుల భారీ విజయం

బ్యాటింగ్ వైఫల్యంతో ఓడాం: కమిన్స్

బ్యాటింగ్ వైఫల్యంతో పాటు ప్రణాళికలకు తగ్గట్లు ఆడకపోవడమే తమ ఓటమిని శాసించిందని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నాడు. ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పాడు. ఏదో ఒక మ్యాచ్‌లో ఏది కలిసి రాదని, ఈ మ్యాచ్ కూడా అలాంటిదేనని తెలిపాడు. ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్ శుభారంభం చేసింది. పెర్త్ వేదికగా సోమవారం ముగిసిన తొలి టెస్ట్‌లో భారత్ 295 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఆసీస్ గడ్డపై భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం. 534 పరుగుల భారీ లక్ష్యఛేధనతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 238 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో బుమ్రా, సిరాజ్ మూడేసి వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్ రెండు వికెట్లు పడగొట్టాడు. నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణాకు తలో వికెట్ దక్కింది. ఈ మ్యాచ్ అనంతరం తమ ఓటమిపై స్పందించిన ప్యాట్ కమిన్స్... తప్పిదాలపై ఫోకస్ పెట్టి అడిలైడ్ వేదికగా జరిగే రెండో టెస్ట్‌కు సిద్ధమవుతామని తెలిపాడు. తమ వ్యూహాలను సరిగ్గా అమలు చేయలేకపోయామన్నాడు. 'ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ మ్యాచ్ కోసం మేం బాగానే సన్నదమయ్యాం. జట్టులోని ప్రతీ ఒక్కరు ఉత్సాహంగా కనిపించారు. కానీ వ్యూహాలను సరిగ్గా అమలు చేయలేకపోయాం. ఇదే మా ఓటమిని శాసించింది. రెండు రోజులు విశ్రాంతి తీసుకొని అడిలైడ్‌లో ప్రాక్టీస్ మొదలు పెడుతాం. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటాం. తొలి టెస్ట్‌లో చేసిన తప్పిదాలపై చర్చిస్తాం. ఈ మ్యాచ్‌లో మాకు ఏది కలిసిరాలేదు. రెండో రోజు నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా తొలి రోజు ఆటలో మా బ్యాటింగ్ వైఫల్యం తీవ్ర నష్టం చేసింది. ఆ రోజు మేం బ్యాట్‌తో మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. జట్టులో చాలా మంది అనుభవం కలిగిన ఆటగాళ్లు ఉన్నారు. టీమ్ ఓటమికి దారితీసిన కారణాలను విశ్లేషిస్తాం.'అని ప్యాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు. పోస్ట్ మ్యాచ్ ప్రజెంటేషన్ సందర్భంగా సరదా ఘటన చోటు చేసుకుంది. మ్యాచ్ అనంతరం బుమ్రా, కమిన్స్.. పోస్ట్ మ్యాచ్ ప్రజంటేషన్‌కు సిద్ధమయ్యారు. ఇద్దరు ముచ్చట్లో మునిగిపోయారు. హోస్ట్ ఆడమ్ గిల్ క్రిస్ట్.. ప్యాట్ కమిన్స్‌ను పిలవగా.. అతను వినిపించుకోలేదు. బుమ్రాతో మాటల్లో లీనమయ్యాడు. వెంనటే బుమ్రా పిలుస్తున్నారని చెప్పడంతో అప్పుడు వచ్చి ఓటమికి గల కారణాలు చెప్పాడు.

ఆస్ట్రేలియాపై టీమిండియా గెలుపు

అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని భారత్ ఘనంగా ఆరంభించింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై 295 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను తప్పక గెలవాల్సిన పరిస్థితిలో ఆరంభ పోరులో దుమ్మురేపింది. ఆల్‌రౌండ్ షోతో కంగారూలను కంగారు పెట్టించింది. న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాస్ పరాజయాన్ని మరిచి చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. 534 పరుగుల కొండంత లక్ష్యంతో ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా 58.4 ఓవర్లలో 238 పరుగులకు కుప్పకూలింది. ట్రావిస్ హెడ్ (89బీ 101 బంతుల్లో, 8 ఫోర్లు), మిచెల్ మార్ష్ (47బీ 67 బంతుల్లో, 3 ఫోర్లు, 2 సిక్సర్లు), అలెక్స్ కేరీ (36బీ 58 బంతుల్లో, 2 ఫోర్లు) పోరాటంతో ఆసీస్ గౌరవంగా ఓడింది. లేదంటే రికార్డు ఓటములు చవిచూసేది. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా మూడు వికెట్లతో విజృంభించారు. వాషింగ్టన్ సుందర్ రెండు, నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా ఒక్క వికెట్ పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 12/3తో నాలుగో రోజు ఆట ఆరంభించిన ఆస్ట్రేలియాను సిరాజ్ ఆదిలోనే దెబ్బకొట్టాడు. ఉస్మాన్ ఖవాజా (4బీ 13 బంతుల్లో)ను పెవిలియన్‌కు చేర్చాడు. తన తొలి ఓవర్ మూడో బంతికే ఉస్మాన్ ఖవాజా (4బీ 13 బంతుల్లో) బోల్తాకొట్టించాడు. టెస్టుల్లో ఖవాజాను సిరాజ్ ఔట్ చేయడం ఇది మూడో సారి. ఆసీస్ ఓపెనర్ ఖవాజాకు 81 బంతులు సంధించిన సిరాజ్ 31 పరుగులిచ్చి మూడు సార్లు పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత డేంజర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (17బీ 60 బంతుల్లో)ను సిరాజ్ ఔట్ చేశాడు. స్టన్నింగ్ డెలివరీతో కుదురుకున్న స్మిత్‌ను సిరాజ్ బోల్తాకొట్టించాడు. దీంతో ట్రావిస్ హెడ్- స్మిత్ 62 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అయితే భారత్ విజయాన్ని ట్రావిస్ హెడ్- మిచెల్ మార్ష్ కాస్త ఆలస్యం చేశారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 87 బంతుల్లో 82 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే హెడ్‌ను బుమ్రా, మార్ష్‌ను నితీశ్ రెడ్డి ఔట్ చేయడంతో ఆసీస్ పతనం ఖరారైంది. అలెక్స్ కేరీ పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. యశస్వీ జైస్వాల్ (161బీ 297 బంతుల్లో, 15 ఫోర్లు, 3 సిక్సర్లు), విరాట్ కోహ్లి (100 నాటౌట్‌బీ 143 బంతుల్లో, 8 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకాల మోత మోగించడంతో రెండో ఇన్నింగ్స్‌ను భారత్ 487/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150, ఆసీస్ 104 పరుగులకే పరిమితమైంది.

చరిత్ర సృష్టించిన నయా కెప్టెన్ బుమ్రా

రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 487/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 150, ఆసీస్ 104 పరుగులకే పరిమితమైంది. తొలి ఇన్నింగ్స్‌లో అయిదు, రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లతో సత్తాచాటిన బుమ్రాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. అయితే రోహిత్ శర్మ గైర్హాజరీలో జట్టును గొప్పగా విజయపథంలో నడిపించిన బుమ్రా సారథిగా అరుదైన ఘనతలు సాధించాడు. పెర్త్‌లో ఆస్ట్రేలియాను ఓడించిన రెండో ఏషియన్ కెప్టెన్‌గా బుమ్రా చరిత్రకెక్కాడు. అంతకుముందు ఈ ఘనతను అనిల్ కుంబ్లే (2008) సాధించాడు. ఇక టెస్టుల్లో భారత కెప్టెన్లు బౌలింగ్‌లో సాధించిన అత్యుత్తమ గణాంకాల జాబితాలో బుమ్రా నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో కపిల్ దేవ్ (10/35) వర్సెస్ వెస్టిండీస్-1983బీ బిషన్ సింగ్ (10/194) వర్సెస్ ఆస్ట్రేలియా-1977బీ బిషన్ సింగ్ (9/70) వర్సెస్ న్యూజిలాండ్- 1976బీ జస్‌ప్రీత్ బుమ్రా (8/72) వర్సెస్ ఆస్ట్రేలియా- 2024బీ కపిల్ దేవ్ (8/109) వర్సెస్ ఆస్ట్రేలియా- 1985.

పిచ్‌లో కాస్త ఘాటు తగ్గింది: బుమ్రా

విజయానంతరం టీమిండియా కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా కీలక వ్యాఖ్యలు చేశాడు. తాను 2018లో ఆడిన పెర్త్ పిచ్‌తో పోలిస్తే ఈ సారి పెర్త్ వికెట్‌లో ఘాటు తగ్గిందని అన్నాడు. 'సిరీస్‌ను చక్కగా ఆరంభించడం సంతోషంగా ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో ఒత్తిడికి గురైన తర్వాత గొప్పగా పుంజుకున్న తీరు పట్ల గర్వపడుతున్నాను. 2018లో పెర్త్‌లో ఆడినప్పుడు వికెట్ తొలుత సాఫ్ట్‌గా ఉంది. ఆ తర్వాత వేగంగా-వేగంగా మారిపోయింది. ఆ అనుభవంతో పోలిస్తే ఈ వికెట్ కాస్త ఘాటు తగ్గింది. ప్రక్రియ, సామర్థ్యంపైనే నేను నమ్ముతాను. అనుభవం ఎంతో ముఖ్యం. అదే ఆటలో భిన్నంగా చేయడానికి సాయపడుతుంది" "ఇక జైస్వాల్ టెస్టు కెరీర్‌ను గొప్పగా ఆరంభించాడు. అతని కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ఇన్నింగ్స్‌గా భావిస్తున్నా. అతను బంతిని వదిలేయడం, సందర్భాన్ని బట్టి ఎటాకింగ్ గేమ్ ఆడటం బాగుంది. విరాట్ కోహ్లి గురించి మాట్లాడాలంటే.. అతను ఫామ్ కోల్పోయాడనేది ఉండదు. సవాలైన వికెట్లపై ఓ బ్యాటర్ ఫామ్‌ను అంచనా వేయలేం. అతను నెట్స్‌లో మంచి లయతో ఉన్నాడు" అని బుమ్రా పేర్కొన్నాడు.



విలియమ్సన్‌పై సన్‌రైజర్స్ అనాసక్తి

కేన్ విలియమ్సన్ అమ్ముడు పోలేదు. రెండో రోజు తొలి రౌండ్‌లో అతన్ని కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంచైజీ కూడా ముందుకు రాలేదు. సుదీర్ఘకాలం అతన్ని అట్టి పెట్టుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ సహా ఏ టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఆసక్తి చూపలేదు. ఐపీఎల్‌లో సుదీర్ఘకాలంగా ఆడుతున్న అనుభవం ఉంది కేన్ విలియమ్సన్‌కు. 2015లో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు. 2024 వరకూ కొనసాగాడు. మొత్తంగా 79 మ్యాచ్‌లల్లో 2,128 పరుగులు చేశాడు. ఇందులో 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని వ్యక్తిగత అత్యధిక స్కోరు 64. 125.62 స్ట్రైక్‌రేట్‌ను నమోదు చేశాడు. బ్యాటింగ్ సగటు 35.47.

రూ.20 కోట్లకు పైగా దక్కించుకున్న ప్లేయర్లు

రిషబ్ పంత్ (భారత్) రూ.27 కోట్లు - ఎల్ఎస్‌జీ
శ్రేయస్ అయ్యర్ (భారత్) 26.75 కోట్లు - పీబీకేఎస్
వెంకటేశ్ అయ్యర్ (భారత్) 23.75 కోట్లు - కేకేఆర్
హెన్రిచ్ క్లాసెన్ (దక్షిణాఫ్రికా) 23 కోట్లు - ఎస్ఆర్‌హెచ్
విరాట్ కోహ్లి (భారత్) 21 కోట్లు - ఆర్సీబీ
నికోలస్ పూరన్ (వెస్టిండీస్) 21 కోట్లు - ఎల్ఎస్‌జీ

సన్ రైజర్స్ హైదరాబాద్

మొత్తం : రూ.120 కోట్లు

రిటెన్షన్ కోసం ఖర్చు చేసింది: రూ.75 కోట్లు
వేలంలో ఖర్చు చేసింది : రూ.44.80 కోట్లు
మిగిలిన నగదు : రూ. 20 లక్షలు
మొత్తం ప్లేయర్లు : 20 మంది
ఇండియన్ ప్లేయర్లు : 13 మంది
ఓవర్సీస్ ప్లేయర్లు : ఏడుగురు

బ్యాటర్లు

అభినవ్ మనోహర్ (భారత్) రూ.3.20 కోట్లు
అథర్వ థైడే (భారత్) రూ.30 లక్షలు
సచిన్ బేబీ (భారత్) రూ.30 లక్షలు
అంకిత్ వర్మ (భారత్) రూ.30 లక్షలు

వికెట్ కీపర్లు

హెన్రిచ్ క్లాసెన్ (దక్షిణాఫ్రికా) రూ.23 కోట్లు
ఇషాన్ కిషన్ (భారత్) రూ.11.25 కోట్లు

ఆల్‌రౌండర్లు

ప్యాట్ కమిన్స్ (ఆస్ట్రేలియా) రూ.18 కోట్లు
నితీశ్ రెడ్డి (భారత్) రూ.6 కోట్లు
అభిషేక్ శర్మ (భారత్) రూ.14 కోట్లు
ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) రూ.14 కోట్లు
బ్రైడన్ కార్సే (ఇంగ్లండ్) రూ.1 కోటి
కమిందు మెండిస్ (శ్రీలంక) రూ.75 లక్షలు
హర్షల్ పటేల్ (భారత్) రూ.8 కోట్లు

బౌలర్లు

రాహుల్ చాహర్ (భారత్) రూ.3.20 కోట్లు
జయదేవ్ ఉనాద్కత్ (భారత్) రూ.1 కోటి
సిమర్‌జీత్ సింగ్ (భారత) రూ.1.50 కోట్లు
జీషన్ అన్సారీ (భారత్) రూ.40 లక్షలు
మహ్మద్ షమీ (భారత్) రూ.10 కోట్లు
ఆడమ్ జంపా (ఆస్ట్రేలియా) రూ.2.40 కోట్లు
ఇషాన్ మలింగ (శ్రీలంక) రూ.1.20 కోట్లు



పీర్ల పండుగ.. పండుగేనా?

పీర్ల పండుగ అసలు పేరు మొహర్రం పండుగ. కాదు.. కాదు.. అది పండుగే కాదు అని కొందరు ముస్లింలు అంటున్నారు. మరి ఇది ఎక్కడి నుంచి వచ్చింది? హిందువులకు పండుగ ఎలా అయ్యింది? విగ్రహారాధనే లేని ఇస్లాంలో పీర్ల పేరుతో విగ్రహాలు ఎలా వచ్చాయి? వాటికి ఊరేగింపు ఎందుకు చేస్తున్నారు? పీర్ల పండుగను హిందువులు జరుపుకోవచ్చా? ఇలా అనేక సందేహాలు ఇప్పటికీ అనేక మందిలో ఉన్నాయి. చరిత్రలోకి తొంగిచూస్తే 14వ శతాబ్దంలో జరిగిన ఓ త్యాగానికి గుర్తుగా మొహర్రాన్ని జరుపుకుంటారు.

ఇజమా నిజమా?

ముస్లింలో ఉండే సున్నీలు, షియాలు వేర్వేరుగా మొహర్రాన్ని జరుపుతారు. మొహర్రం జరిగే పది రోజులు పర్వదినాలు కానేకావు. అవి విషాద దినాలు. కొందరు ముస్లింలు అయితే.. మొహర్రం నెలంతా సంతాప దినాలుగా జరుపుకుంటారు. కుటుంబంలోని వారంతా నల్ల బట్టలు వేసుకొని సంతాపాన్ని తెలుపుతారు. ఈ నెల రోజులు వారి ఇళ్లలో ఎలాంటి శుభకార్యాలు జరపరు. కొత్త వస్తువులూ కొనరు. కానీ.. హిందువులు మాత్రం పీర్ల పండుగ రోజు కొత్త బట్టలు వేసుకుంటారు. పీర్లకు ఊదు పొగ వేస్తారు. దస్తీ కడతారు. మేకను బలి ఇస్తారు. అయితే.. ఇదంతా సరి కాదని అంటున్నారు కొందరు ముస్లిం పెద్దలు. పీర్ల పండుగ చేయడం సరికాదని సున్నీ వర్గం వాదిస్తోంది. రక్తం వచ్చేలా కొట్టుకోవడం, గుండెలు బాదుకోవడం, నిప్పుల గుండంలో నడవటం వంటివి ఇస్లాం కూడా అంగీకరించని పద్ధతులు అని స్పష్టం చేస్తున్నారు. తామే ఈ పండుగను జరుపుకోం అని.. అలాంటిది హిందువులు ఎందుకు ఈ పండుగను చేసుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. అయితే, షియా వర్గం మాత్రమే పీర్ల పండుగను చేస్తుంది. అంటే.. ముస్లింలలోనే ఈ పండుగ తీరుపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

హిందూ పండుగల్లో ఒక్కో పండుగకు ఒక్కో విశిష్టత ఉందని.. హిందూ పండుగలకు సంబంధం లేని పీర్ల పండుగ చేసుకోవటం ఏమిటి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు అది హిందూ పండుగ అని అంటుంటారు. వాళ్లు చేసే పూజావిధానం హిందువులది కాదు.. అక్కడ సమర్పించే పదార్థాలు హిందూ పద్ధతిలో సమర్పించేవి కావు.. ఆ పీర్లకు వేసే వేషాధారణ హిందూ పద్ధతిలో ఉండదు. ఈ పీర్ల పండుగ తమది కాదు.. ఎవరో తమ పూర్వీకులు చనిపోతే.. వాళ్లకు తాము సంవత్సరీకం చేస్తే.. బాధతో తాము ఈ కార్యక్రమాన్ని నిర్వర్తిస్తే హిందువులు మాత్రం పండుగలా చేసుకోవడం ఏమిటి? అని ముస్లిం వర్గం ప్రజలే నిలదీస్తున్నారు.

పీర్ల పండుగకు మూలం..

మహ్మద్ ప్రవక్త కాలానికి వెళ్తే.. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ ప్రతినిధులను (ఖాలీఫా) ఎన్నుకోవాలని ప్రవక్త ప్రజలకు సూచించాడు. హజరత్ అబూ బకర్, హజరత్ ఉస్మాన్, హజరత్ అలీ.. ఇలా వీళ్లంతా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్న ఖాలీఫాలే. హజరత్ అలీ తర్వాత ప్రజలు ఇమాం హసన్‌ను ప్రజలు ప్రతినిధిగా ఎన్నుకున్నారు. అయితే, సిరియాకు చెందిన మావియా.. హసన్‌ను తప్పించి తానే ఖాలీఫా కావాలని అనుకున్నాడు. హసన్‌పై యుద్ధం ప్రకటించాడు. అయితే, యుద్ధం వల్ల ప్రజలు చనిపోతారని భావించిన హసన్.. తన పదవిని మావియాకు ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. అయినా ఆయనపై విషప్రయోగం జరిగి చనిపోయాడు. తన అన్న హసన్‌ను చంపిన తీరుతో కలత చెందిన తమ్ముడు హుస్సేన్.. దీనిపై చర్చించేందుకు రాజధాని కుఫాకు బయలుదేరగా, ఈ విషయం తెలిసిన మావియా కొడుకు యాజిద్ తన సైన్యంతో ఎదురు వెళ్లాడు. హుస్సేన్‌తో పాటు ఉన్న 72 మందిపై యుద్ధం ప్రకటించాడు. పది రోజుల పాటు జరిగిన ఈ యుద్ధంలో హుస్సేన్ సహా అంతా మరణిస్తారు. అలా ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన హసన్, హుస్సేన్ అమరత్వానికి గుర్తుగా మొహర్రం నెలలోని పది రోజుల పాటు విషాద దినాలు పాటిస్తారు. హసన్, హుస్సేన్ ప్రతిరూపాలను పీరులో చూసుకుంటూ కొలుస్తారు. పీరు అంటే.. ఆధ్యాత్మిక గురువు అని అర్థం. ఇంతటి విషాద చరిత్ర ఉన్న ఈ సందర్భాన్ని హిందువులు పండుగగా చేసుకోవడం ఏమిటి? ఇస్లాం అంగీకరించని ఈ పద్ధతులు చేయడం ఏమిటి? అని ముస్లిం వర్గం నుంచే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నిజాం పాలనలో తెలంగాణలోకి..

తెలంగాణ నిజాం రాజుల పాలనలో ఉండగా.. హిందువులు, క్రైస్తవులను ఇస్లాం మతంలోకి లాగటం కోసం ప్రజలంతా పీర్ల పండగ చేసుకోవాలని నిజాం ఆదేశించినట్లు కొంతమంది చరిత్ర కారులు చెప్తున్నారు. అందువల్లే తెలంగాణలో పీర్ల పండుగ ఆచరణ ప్రారంభమైందని పేర్కొంటున్నారు. హిందూ ఆడబిడ్డలను ఒంటిపై బట్టలు లేకుండా బతుకమ్మలు ఆడించిన సందర్భాలు తెలిసినవేనని.. అలాంటి చీకటి రోజుల్లో నుంచి వచ్చినదీ ఈ పీర్ల పండుగేనని స్పష్టం చేస్తున్నారు.

ఏటా ఒకసారి సూర్య కిరణాలు తాకే దేవాలయాలు

1. వేదనారాయణ స్వామి దేవస్థానం, నాగలాపురం, తిరుపతి జిల్లా
2. లక్ష్మీ దేవస్థానం, కొల్హాపూర్, మహారాష్ట్ర
3. గవిగంగాధర్ దేవస్థానం, బెంగళూర్, కర్ణాటక
4. అరసవెల్లి సూర్య నారాయణ దేవస్థానం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్
5. మొగిలీశ్వర్ ఆలయం, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
6. కోదండరామ దేవాలయం, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్
7. సూర్యనారాయణ దేవాలయం-జోగులాంబ అలంపూర్, గద్వాల జిల్లా, తెలంగాణ
8. కోణార్క్ సూర్య దేవాలయం, ఒడిశా
9. అయోధ్య రామాలయం, ఉత్తరప్రదేశ్ (ప్రత్యేక పద్ధతి ద్వారా)

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!

సంపూర్ణ ఆరోగ్యానికి సూర్య నమస్కారాలు

ప్రతిరోజు సూర్య నమస్కారాలు చేయడం వల్ల మనం ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల నుండి దూరంగా ఉండవచ్చు. జీర్ణవ్యవస్థ, గుండె, నాడీ వ్యవస్థ ఇలా శరీర వ్యవస్థ అంతా సక్రమంగా బలపడుతుంది. రక్త సరఫరా మెరుగవుతుంది. ప్రతి రోజు సూర్య నమస్కారాలను సాధన చేయటం వల్ల రోజంతా హుషారుగా ఉంటాం. రక్త వ్యవస్థ, నాడీ వ్యవస్థ, వెన్నెముక అన్నీ ఒకేసారి ప్రభావితం అవుతాయి. ఆడవారిలో మెనోపాజ్, పీరియడ్స్, థైరాయిడ్, షుగర్, అధిక బరువు వంటి సమస్యలకు ఏకైక పరిష్కారం.. సూర్యనమస్కారాలు. ఒక్క మాటలో చెప్పాలంటే సూర్య నమస్కారాలు సర్వరోగ నివారిణి. సూర్య నమస్కారం అనే పేరు ఒక్కటే అయినా... అందులో 12 రకాల ఆసనాలు ఉంటాయి.

ఆసనాలతో ప్రయోజనం

- **ఒకటి, పన్నెండు :** శరీర సమతుల్యత సాధించవచ్చు. శ్వాసకోశ వ్యవస్థ మెరుగుపడుతుంది. వెన్నెముక, మెడ, భుజాల దగ్గర ఉన్న కండరాలు బలోపేతం అవుతాయి.
- **రెండు, పదకొండు :** జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. వెన్నెముక, పిరుదులు బలోపేతమవుతాయి.
- **మూడు, పది :** రక్త ప్రసరణ పెంచుతాయి. కాలి కండరాలను బలోపేతం చేస్తాయి. గ్రంథులపై కూడా ప్రభావం చూపుతాయి.
- **నాలుగు, తొమ్మిది :** వెన్నెముక, చేతి మణికట్టు కండరాలను బలోపేతం చేస్తాయి.
- **ఐదు, ఎనిమిది:** గుండెను బలోపేతం చేస్తాయి. మెడ, భుజాల దగ్గర ఉండే ఒత్తిడిని తగ్గిస్తాయి.
- **ఆరో ఆసనం :** మెడ, భుజాలలో ఒత్తిడిని తగ్గిస్తుంది.
- **ఏడో ఆసనం :** జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. వెన్నెముక బలంగా మారడానికి ఉపకరిస్తుంది.

-అలేఖ్య

మరెన్నో లాభాలు

సూర్య నమస్కారాలతో ఎముకలు, కండరాలు బలోపేతమై ఆరోగ్యంగా ఉండటమే కాదు.. మధుమేహం, బీపీ, గుండె జబ్బుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుందని శాస్త్రవేత్తలు కూడా పేర్కొంటున్నారు. 12 రకాల భంగిమల్లో కొన్నింటిని నెమ్మదిగా చేయాలి. మరి కొన్నింటిని వేగంగా చేయాలి. వేగంగా చేసే భంగిమలతో కండరాలకు మేలు జరుగుతుంది. ఏరోబిక్స్‌తో సమానమైన ఫలితాలు సాధించవచ్చు. నెమ్మదిగా చేసే సూర్య నమస్కారాలు శ్వాస నియంత్రణకు ఉపయోగపడతాయి. ఎక్కువ గాలిని పీల్చి, వదలడం ద్వారా ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది.

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com